www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
28-07-2024

సంపుటి : 01 । సంచిక : 85 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం వికసిత్ భారత్@2047 లక్ష్యం.. ఇదే ప్రతి ఒక్క భారతీయుడి ఆశయం కావాలి..ఈ దశాబ్దం మార్పులు, సాంకేతికత, భౌగోళిక రాజకీయాలు కూడినది..భారత్‌ను అభివృద్ధిచెందిన దేశంగా తీర్చిదిద్దడానికి ముందడుగు.. కరోనా మహమ్మారిని జయించి ప్రజలు ఉత్సాహం, విశ్వాసంతో ఉన్నారు..అంటూ నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలు చేశారు..

## ప్రతి భారతీయుడి ఆశయం

# వికసిత్ భారత్ 2047



## సాధించడంలో రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం

- ప్రతి సీఎంకు మాట్లాడేందుకు 7 నిమిషాల సమయం ఇచ్చాం
- కొన్ని రాష్ట్రాల సూచనలు, వారి ప్రణాళికలు చాలా బాగున్నాయి
- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోఢీ వ్యాఖ్యలు

**విశ్వంభర, ఢిల్లీ**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్క భారతీయుడి ఆశయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉండటం వల్ల ఈ ఆశయ సాధనలో రాష్ట్రాలు ముఖ్యమైన పాత్ర పోషించేందుకు అవకాశం ఉందని తెలిపారు. పాలకమండలి సమావేశంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు నీతి ఆయోగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేసింది. నీతి ఆయోగ్ సమావేశంలో ఈ దశాబ్దం మార్పులు, సాంకేతికత, భౌగోళిక రాజకీయాలు సహా అవకాశాలతో కూడుకున్నదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ అవకాశాలను భారత్ అందిపుచ్చుకుని అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా విధానాలను రూపకల్పన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మిగతా2లో...

# విచారణకు సిద్ధమా?

## అప్పుల లెక్కలు చెప్పి... అమ్మకాల లెక్కలు చెప్పడం లేదు

- గొర్రెల పంపిణీ, బతుకమ్మ చీరల్లో భారీ అవినీతి
- లక్షల కోట్ల విలువైన అవుటర్ రింగ్ రోడ్డును రూ.7 వేల కోట్లకే అమ్మేశారు
- కేసీఆర్ కిట్ల విషయంలోనూ విచారణ జరిపిస్తామన్న రేవంత్



**విశ్వంభర, హైదరాబాద్:** గొర్రెల పంపిణీ, బతుకమ్మ చీరల విషయంలో భారీ అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నేతలు విచారణకు సిద్ధమా? అంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో రూ.700 కోట్ల అవినీతికి పాల్పడ్డారు, సూరత్ నుంచి కిలోల మిగతా2లో...

## తెలంగాణ నూతన గవర్నర్‌గా

# జిష్ణుదేవ్ వర్మ



**విశ్వంభర, ఢిల్లీ:** పలు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమించారు. తెలంగాణ గవర్నర్ గా జిష్ణుదేవ్ వర్మ, మహారాష్ట్ర గవర్నర్ గా సిపి రాధాకృష్ణన్ ను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు.

## బీఆర్ఎస్ హయాంలో

# ఆర్థిక విధ్వంసం

- గత ప్రభుత్వం మాదిరి మేము గొప్పలకు పోలేదు
- 100 శాతం వాస్తవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం
- హైదరాబాద్ ప్రగతికి రూ. 10 వేల కోట్లు పెట్టిన ఘనత తమదే
- శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

2

# బాబుకు ప్రధాని మరోవరం

- తెలంగాణ-ఆంధ్రప్రదేశ్-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ కొత్తగా హైస్పీడ్ రహదారి
- ఆరు వరుసలుగా కారిడార్..
- 120కి.మీ.లకు పెరగనున్న వాహనాల వేగం

2



హైదరాబాద్‌ను వణికిస్తున్న

# నోరో వైరస్..

- ప్రజలకు జీహెచ్ఎంసీ కీలక సూచనలు
- పాతబస్తీ ప్రాంతంలో కేసులు నమోదైనట్లు సమాచారం
- మధుమేహ వ్యాధిగ్రస్తులు జాగ్రత్త.. వైద్యుల సూచన

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 94 | ₹ 116 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 168 | ₹ 191 |



# హరీష్ V/S కోమటిరెడ్డి

- హరీశ్ రావు వద్ద సబ్జెక్ట్ లేదన్న కోమటిరెడ్డి..
- ఆయనది హాఫ్ నాలెడ్జ్ అన్న హరీశ్ రావు
- బీఆర్ఎస్ అంటేనే అబద్దాలకు పుట్టినిల్లు అన్న మంత్రి కోమటిరెడ్డి
- హరీశ్ రావు ఓ డమ్మీ నాయకుడన్న మంత్రి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య మాటలయుద్ధం సాగింది. బడ్జెట్‌పై ప్రసంగం సమయంలో హాఫ్ నాలెడ్జ్ అంటూ పరస్పరం విమర్శలు గుప్పించుకున్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కోమటిరెడ్డి మిగతా2లో...





రిపోర్టర్స్ కావలెను

V3 NEWS లక్ష్యం సమాజహితం

తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.

Wanted Reporters & Marketing Executives

Contact: 9441222429 | 8885402108

# హరీష్ V/S కోమటిరెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**

మాట్లాడుతూ... హరీశ్ రావు గ్యారెంటీల గురించి మాట్లాడుతున్నారని, కానీ బీఆర్ఎస్ అంటేనే అబద్ధాలకు పుట్టిల్లు అన్నారు. బడ్జెట్‌ను చీల్చి చెండాడుతామన్న కేసీఆర్ సభకే రాలేదన్నారు. సభలో సమాధానం చెప్పలేక కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. ఆయన స్థానంలో హరీశ్ రావును పంపించారన్నారు. హరీశ్ రావు ఓ డమ్మీ నాయకుడు అన్నారు. ఆయన మాటలు దెయ్యాలు వేదాలు వెల్లించినట్లుగా ఉందన్నారు. 24 గంటలు కరెంట్ ఇచ్చామని హరీశ్ రావు చెప్పారని, కానీ అందులో నిజం లేదన్నారు. హరీశ్ రావు వద్ద సబ్జెక్ట్ లేదని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. కోమటిరెడ్డికి హాఫ్ నాలెడ్జ్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్య మీకు ఇబ్బందిగా అనిపిస్తే మీరు రికార్డ్స్ నుంచి తొలగించుకోండని హరీశ్ రావు సభాపతికి సూచించారు. రేవంత్ రెడ్డి డబ్బులిచ్చి టీపీసీసీ తెచ్చుకున్నారని కోమటిరెడ్డి గతంలో అనలేదా? అని ప్రశ్నించారు. బస్సులు సరిపోక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బస్సులను పెంచాలని సూచించారు.

# ప్రతి భారతీయుడి ఆశయం వికసిత్ భారత్ 2047

**(మొదటి పేజీ తరువాయి)**

భారత్‌ను అభివృద్ ధిచెందిన దేశంగా తీర్చిదిద్దడానికి ఇది ఒక అడుగు అని పేర్కొన్నారు. మనం సరైన దిశలోనే పయణిస్తున్నామని వందల ఏళ్లకు ఒకసారి వచ్చే మహమ్మారిని జయించామని వెల్లడించారు. ప్రజలు ఉత్సాహం, విశ్వాసంతో ఉన్నారన్న ఆయన, రాష్ట్రాల సంయుక్త కృషితో వికసిత్ భారత్-2047ను సాకారం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. వికసిత్ రాష్ట్రాలు, వికసిత్ భారత్‌ను తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. అయితే సమావేశం అనంతరం వివరాలను నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మీడియాకు వెల్లడించారు. "వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్ సాధించే దిశగా ప్రధాని మోదీ కీలక సూచనలు చేశారు. మమతా బెనర్జీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదనటం వాస్తవం కాదు. ప్రతి సీఎంకు మాట్లాడేందుకు 7 నిమిషాల సమయం ఇచ్చాం. ప్రధానంగా రెండు అంశాలపై చర్చ జరిగింది. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం అయ్యే ప్రణాళికపై చర్చించాం. దేశంలో ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనపై చర్చించాం. వికసిత్ భారత్‌పై కేంద్రం రూపొందించిన డాక్యుమెంట్‌ను వివరించాం. వికసిత్ భారత్ సాధించడంలో రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం. రాష్ట్రాలు అమలు చేయాల్సిన ప్రణాళికలపై సూచనలు చేశాం. వైద్యరంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై విస్తృతంగా చర్చించాం. సైబర్ సెక్యూరిటీలో అమలు చేయాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించాం. అభివృద్ధి విషయంలో రాష్ట్రాల ప్రణాళికలు కూడా నీతి ఆయోగ్ శ్రద్ధగా విన్నది. కొన్ని రాష్ట్రాల సూచనలు, వారి ప్రణాళికలు చాలా బాగున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ సహా పది రాష్ట్రాల నుంచి నీతి ఆయోగ్ సమావేశానికి ఎవరూ పాల్గొనలేదు" అని సీఈవో వివరించారు.

# మందు బాబులకు షాక్..


**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో మందు బాబులకు షాక్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో మద్యం అమ్మకాల ద్వారా అంచనా వేసిన ఆదాయం చూస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది. ఇదే అంశం పైన శాసనసభలో చర్చ జరిగింది. బడ్జెట్ ప్రతిపాదనలు చూసిన తరువాత తెలంగాణలో పెద్ద మొత్తంలో బీర్లు, లిక్కర్ ధరలు పెరగటం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుత సంక్షేమ పథకాలకు నిధుల సమీకరణకు ప్రభుత్వం ఈ మార్గం ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ధరల పెంపు ఎక్సైజ్ అంశం పై మాజీ మంత్రి హరీష్ అసెంబ్లీలో స్పందించారు. బీర్లు, లిక్కర్ ధరలు రాబోయే రోజుల్లో భారీగా పెంచబోతున్నట్లు బడ్జెట్ అంచనాలు పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు తల దించుకోవాలని విమర్శించారు. 2023-24 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ. 19,884 కోట్ల ఆదాయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుకుంటే, 2024-25కు గాను కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25,617 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. బడ్జెట్ లెక్కల్లో దీని ద్వారా రూ. 5,773 కోట్లు అదనంగా అంచనా వేసుకున్నారు. రూ. 2,760 కోట్లుగా ఉన్న బీర్లపై డ్యూటీని రూ. 3,500 కోట్లకు పెంచారు. లిక్కర్‌పై ఉన్న డ్యూటీని రూ. 11,031 కోట్ల నుంచి రూ. 15,500 కోట్లకు పెంచారు. అంటే బీర్లు, లిక్కర్ ధరలు రాబోయే రోజుల్లో భారీగా పెంచబోతున్నట్లు స్పష్టం చేశారని హరీశ్‌రావు తెలిపారు. 2023-24లో ఉన్న రూ. 14,570 కోట్ల ఎక్సైజ్ వ్యాట్‌ను 2024-25కు గాను రూ. 16,432 కోట్లుగా అంచనా వేశారు. అంటే రూ. 2000 కోట్ల వ్యాట్‌కు సమానమైన మద్యం అమ్మకాలను పెంచబోతున్నట్లు చెప్పారు.

# రాష్ట్ర బడ్జెట్ లెక్కల గారడిలాగా ఉంది

- **అందమైన పెద్ద పెద్ద పదాలు, అంకెలతో తయారు చేశారు**
- **బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్**

**విశ్వంభర,హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కల గారడిలాగా ఉందని బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్ ఎద్దేవా చేశారు. అందమైన పెద్ద పెద్ద పదాలు, అంకెలతో బడ్జెట్ తయారు చేశారని ఆయన విమర్శించారు. కేంద్రం నుంచి తెలంగాణకు బడ్జెట్‌లో నిధులు రాలేదని విమర్శలు చేయడం బాధాకరమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పదం ఉచ్చరించలేదన్న కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర బడ్జెట్‌లో ఏ ఏ జిల్లాల పేర్లను పలికారో చెప్పాలని డిమాండ్ చేశారుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ అంశంపై కేంద్రాన్ని కోరగానే, వెంటనే రక్షణ శాఖ భూములను అప్పగించడానికి ఒప్పుకుందని ఆయన గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన చాలా అంశాలపై సీఎం వద్ద స్వయంగా విజ్ఞప్తి చేసుకున్నప్పటికీ, తన విజ్ఞప్తులపై రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదని అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు నిధులు కేటాయించలేదు కాబట్టి తాను నిరసన చేస్తే బాగుంటుందా అని పాయల్ శంకర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో 64 లక్షల రైతులు రూ.71 వేల కోట్ల రుణాలు తీసుకున్నట్లు తమకు సమాచారం ఉందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ.31 వేల కోట్లు, 44 లక్షల రైతులు అన్నట్లుగా లెక్కలు చెబుతోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కౌలు రైతుల ఊసే లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు మాత్రం సన్న వడ్లకు మాత్రమే బోనస్ అంటున్నారని దుయ్యబట్టారు రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా అమలు చేస్తామని చెప్పింది తప్పితే జులై నెల ముగుస్తున్నా ఇంకా అమలు చేయడం లేదని పాయల్ శంకర్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శాసనసభ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంటే ఇచ్చిన హామీలను అమలు చేయడం సాధ్యం కాదన్నారు. 6 నెలల్లో మెగా డీఎస్సీ పేరుతో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారని, ఏడు నెలలు గడిచిపోయిందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కార్పొరేషన్ ద్వారా నిధులు దొరికేవని, గత పదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కార్పొరేషన్‌లలో నిధులు లేవని పాయల్ శంకర్ తెలిపారు. ఐటీడీఏలకు నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఉందని హితవు పలికారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోదీని నిందించడం వల్ల ఏం సాధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో ఉందనిపిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించలేదంటూ మాట్లాడుతున్నారు. మీరు ఈ బడ్జెట్‌లో ఏఏ జిల్లాలకు నిధులు కేటాయించాలో చెప్పాలని డిమాండ్ చేసారు.

# హైదరాబాద్‌ను వణికిస్తున్న నోరో వైరస్..




**విశ్వంభర, హైదరాబాద్:** ప్రపంచాన్ని గడగడలాడించిన వైరస్ కోవిడ్. 2019 ఎండింగ్ నుండి 2022 వరకు అనేక దేశాలను భయపెట్టింది. ఎంతో మంది ప్రాణాలను హరించింది. అలాగే చావు అంచుల వరకు వెళ్లి బయటకు వచ్చిన వాళ్లున్నారు. ఈ సమయంలో బ్రతుకే ప్రశ్నార్థకం అయ్యింది. ఆ తర్వాత వ్యాక్సిన్లు రావడంతో దీని తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇప్పటికీ కొన్ని దేశాల్లో ఈ వైరస్ ప్రభావం కొనసాగుతుంది. మొన్నటి మొన్న నటుడు అక్షయ్ కుమార్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దీని బాధితులైన సంగతి విదితమే. ఇదిలా ఉంటే ఇప్పుడిప్పుడే ఈ వైరస్ నుండి ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలను మరో వైరస్ భయపెడుతుంది. అదే నోరో వైరస్. ఈ వైరస్ కలుషితమైన పరిసరాలు, నీరు, ఆహారం వల్ల వ్యాప్తి చెందుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పుడు ఇది హైదరాబాద్ మహా నగరానికి వ్యాపించడమే కాదు విజృంభిస్తుంది. దీంతో ప్రజలను అలర్ట్ చేసింది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. ప్రస్తుతం ఈ నోరో వైరస్ కేసులు హైదరాబాద్‌లోని యాకత్ పురా, మలక్ పేట్, డబీర్ పురా, పురానీ హవేలీ, మొఘల్ పురాతో పాటు పలు ప్రాంతాల్లో ఈ కేసులు నమోదు అవుతున్నట్టు తెలుస్తోంది. పాతబస్తీ ప్రాంతంలో కొన్ని కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ వైరస్‌తో జాగ్రత్తగా ఉండాలంటూ ట్విట్టర్ వేదికగా జీహెచ్ఎంసీ పలు సూచనలు చేసింది. కలుషిత నీరు, ఆహారం కారణంగానే ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వెల్లడించింది. లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పేర్కొంది. ఈ వైరస్ బారిన పడిన వారిలో చలిజ్వరం, వాంతులు, విరేచనాలు, నీరసం, కడుపు నొప్పి, డీహైడ్రేషన్ వంటి లక్షణాలు ఉంటాయని చెబుతుంది. అలాగే ఇదో రకమైన అంటు వ్యాధి కావడంతో అప్రమత్తత అవసరమని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు . అలాగే జీహెచ్ఎంసీ కొన్ని సూచనలు కూడా చేసింది . చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని.. కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని పేర్కొంది. ఇంటిని పరిసరాలను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసుకోవాలని సూచించింది. కలుషిత నీటితో పాటు నాణ్యత లేని ఆహారం కూడా ఈ వ్యాధికి కారణంగా వైద్యులు చెబుతున్నారు. వానా కాలం కావడంతో సాధారంగా వ్యాప్తించే ఫ్లూ తరహాలోనే ఉంటుందని, కానీ దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలుస్తుంది. వైరస్ సోకిన వ్యక్తిలో 48 గంటల్లోనే వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని చెబుతున్నారు వైద్యులు. ముఖ్యంగా ఈ వైరస్ మధ్య వయస్కులు, సీనియర్ సిటిజన్‌లు, గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికలు దీని బారిన పడే అవకాశాలున్నాయని, కిడ్నీపై ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. విరేచనాలు, వాంతులు, శరీరం వేగంగా డీహైడ్రేషన్ అవ్వడంతో మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందట. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎక్కువుగా ఈ వైరస్ బారినపడే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

# చంద్రబాబుకు ప్రధాని మోడీ మరోవరం

**విశ్వంభర, అమరావతి**

నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా రహదారుల విస్తరణకు, కొత్త రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అనుసంధానం పెరిగితే అభివృద్ధి సహజంగానే జరుగుతుందనేది మోడీ ఆలోచన. అందుకనుగుణంగా నితిన్ గడ్కరీకే ఈసారి కూడా రహదారుల శాఖను కట్టబెట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మిషన్ - 2047లో భాగంగా తెలంగాణ-ఆంధ్రప్రదేశ్-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ కొత్తగా హైస్పీడ్ రహదారిని నిర్మించాలని నిర్ణయించారు.

హైస్పీడ్, గ్రీన్ ఫీల్డ్ కారిడార్ గా ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు మధ్య నాలుగు వరుసల రహదారి ఉంది. దీన్ని ఆరు వరుసలకు అభివృద్ధి చేస్తే ఎలా ఉంటుంది అనే విషయంపై సర్వే నిర్వహించగా హైస్పీడ్ కు తగినట్లుగా దాన్ని విస్తరించడం సాధ్యం కాదని తేలింది. దీంతో 508 కిలోమీటర్ల మేర హైస్పీడ్, గ్రీన్ ఫీల్డ్ కారిడార్ ను రూపొందించాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖ నిర్ణయం తీసుకొని తన మాస్టర్ ప్లాన్ లో ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య 556 కిలోమీటర్ల మేర రహదారి అందుబాటులో ఉంది. ఏపీలో 260 కిలోమీటర్లు, తెలంగాణలో 190 కిలోమీటర్లు, కర్ణాటకలో 106 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. హైదరాబాద్ నుంచి నాగ్ పూర్ మధ్య రాకపోకలు పెంచాలని హైదరాబాద్-నాగ్‌పూర్-బెంగళూరు మధ్య రాకపోకలు మరింతగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రిందటే నిర్ణయించింది. బెంగళూరు నుంచి నాగ్ పూర్ వరకు నిర్మించబోతున్న జాతీయ రహదారికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు మధ్య కూడా హైస్పీడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ నుంచి నాగ్పూర్ కు రాకపోకలు పెరుగుతాయనేది కేంద్రం ఆలోచన. కొత్తగా నిర్మించబోయే హైస్పీడ్ కారిడార్ ను ఆరు వరుసలుగా నిర్మిస్తారు. డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ ఆమోదం పొందిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు మధ్య కొత్తగా నిర్మించబోయే రహదారిపై 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా వీలుంది. ఈ హైస్పీడ్ కారిడార్ ను తొలుత నాలుగు వరుసలుగా నిర్మించి తర్వాత ఆరు వరుసలుగా అభివృద్ధి చేస్తారా? లేదంటే నిర్మించడమే ఆరు వరుసలగా నిర్మిస్తారా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.

# బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక విధ్వంసం



**విశ్వంభర,హైదరాబాద్ :** బడ్జెట్‌పై విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు. వందశాతం వాస్తవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం మాదిరి, గొప్పలకు పోలేదని వివరించారు. అంతకుముందు కాంగ్రెస్ చేసిన అభివృద్ధి వల్లే హైదరాబాద్‌కు వెల్లువలా పెట్టుబడులు వచ్చాయన్న భట్టి విక్రమార్క, గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. మహిళలకు వడ్డీలేనిరుణాల కోసం రూ. 20వేల కోట్లు కేటాయించామన్న ఆయన హైదరాబాద్ ప్రగతికి రూ. 10 వేల కోట్లు పెట్టిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. నూటిని నూరుశాతం గ్యారంటీలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. గత పదేళ్లలో సాగునీటి సమస్య ఏ మాత్రం తీరలేదు : సాగునీటి సమస్య తీరాలనే పోరాడి రాష్ట్రం తెచ్చుకున్నామన్న ఉపముఖ్యమంత్రి, రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం నిర్మించినా, ఉపయోగం లేకుండా పోయిందన్నారు. మేడిగడ్డ వద్ద వచ్చిన నీరు వచ్చినట్లే పోతోందని, నిల్వ చేయలేని పరిస్థితి ఉందని దుయ్యబట్టారు. గత పదేళ్లలో సాగునీటి సమస్య ఏ మాత్రం తీరలేదని ఆక్షేపించారు.

**బీఆర్ఎస్ అప్పుల పాలు చేసింది..**

''తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బీఆర్ఎస్ విధ్వంసం చేసి, అప్పుల పాలు చేసింది. ఉద్యోగస్తులకు జీతాలు కూడా చెల్లించలేని కటకటలాడే పరిస్థితి తీసుకువచ్చింది. మేము అధికారంలోకి వచ్చాకే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి.. నెలనెలా మొదటి తేదీన జీతాలు ఇస్తున్నాం. వ్యవసాయాన్ని, సంక్షేమాన్ని, పరిశ్రమలను హైదరాబాద్ నగరాన్ని, మహిళలను, యువతను అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రవేశ పెట్టాం. తాము పెట్టిన బడ్జెట్ పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సభ సాక్షిగా మాజీ మంత్రి హరీష్ రావు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. సభను, రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం సరైంది కాదు'' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేశారు..**

''ఎక్సైజ్‌లో మేము వేలం పెట్టాం మాకు ఆదాయం పెరిగింది అంటున్నారు.. అసలు వేలం ఇప్పుడు కదా పెట్టాల్సింది.. మీరు ముందే ఎందుకు పెట్టారు?? ఎంత దొరికితే అంత దోచుకుందామనే వేలం ముందే పెట్టారు. ప్రభుత్వానికి వేలం ద్వారా రావాల్సిన ఆదాయాన్ని టానిక్ లాంటి మద్యం దుకాణాలు పెట్టి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేసి కొన్ని కుటుంబాల జేబుల్లోకి పోయేలా చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు 2024-25 వార్షిక బడ్జెట్ లో 3,836 కోట్లు కేటాయింపులు చేశాం. ఇందిరా మహిళా శక్తి పథకానికి 2024-25 వార్షిక బడ్జెట్‌లో రూ. 50.41కోట్లు కేటాయించాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు, వారి గుండె చప్పుడును అర్థం చేసుకొని అత్యంత ప్రగతిశీల భావాలతో పీపుల్స్ బడ్జెట్‌గా ఈ సభలో ప్రవేశ పెట్టాం'' అని భట్టి విక్రమార్క తెలిపారు.



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్‌గుప్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆనంద్‌రాజ్, మల్లేశ్‌గౌడ్, మధుగౌడ్, కిషోర్ పాల్గొన్నారు. - విశ్వంభర, ఎల్బీనగర్



# విచారణకు సిద్ధమా?: సీఎం రేవంత్ రెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**

లెక్కన చీరలు తెచ్చి బతుకమ్మ చీరల పేరిట పంపిణీ చేశారు, లక్షల కోట్ల విలువ చేసే అవుటర్ రింగ్ రోడ్డును రూ.7 వేల కోట్లకు అమ్మేశారు అంటూ రేవంత్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు. "అవుటర్ రింగ్ రోడ్డు 159 కిలోమీటర్లు ఉంటుంది. ఆనాడు కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన రీతిలో ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించింది. కానీ లక్షల కోట్ల విలువ చేసే అవుటర్ రింగ్ రోడ్డును పల్లీ బఠాణీలకు అమ్మినట్టు అమ్మేశారు. గొర్రెల పథకంలో ఎన్ని గొర్రెలు ఇచ్చారో, ఎన్ని గొర్రెలు ఉన్నాయో ఇవాళ లెక్కలన్నీ ఉన్నాయి. ఏసీబీ వాళ్లు పైపైన విచారణ చేస్తేనే రూ.700 కోట్ల అవినీతి తేలింది. బీఆర్ఎస్ సభ్యులు కోరుకుంటే కేసీఆర్ కిట్లలో ఏం అవినీతి జరిగిందో కూడా విచారణ చేయిస్తామని తెలిపారు. ఇదేకాకుండా, చేనేత కార్మికులకు పని కల్పిస్తున్నామంటూ బతుకమ్మ చీరల పథకం తెచ్చారు. ఇదొక గొప్ప పథకం అన్నారు. కానీ సూరత్ వెళ్లి కిలోల లెక్కన చీరలు తెచ్చి ఆడబిడ్డలను మభ్యపెడితే, ఆడబిడ్డలే వీధుల్లోకి వచ్చి ఆ చీరలను తగులబెట్టారు. ఆ చీరలను ఆడబిడ్డలు ఎవరూ కట్టుకోవడంలేదు. పొలాల్లో పిట్టలను తరమడానికి ఆ చీరలు ఉపయోగిస్తున్నారు. బతుకమ్మ అనేది తెలంగాణ మహిళలకు ఓ సెంటిమెంట్. ఆ సెంటిమెంట్ ను కూడా దోపిడీకి ఉపయోగించుకున్నారన్నారు . 2006లో కేసీఆర్ వస్తే పాలమూరు ప్రజలు ఆదరించి గెలిపించారని ముఖ్యమంత్రి అన్నారు. మరి పదేళ్లలో పాలమూరు ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలోని భూములు.. ఆస్తులు అమ్ముకున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేవెళ్ల ప్రాజెక్టును నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అబద్ధాలు చెబితేనే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని, లోక్ సభ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిజాయతీగా పాలన చేసి ఉంటే... బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్లు, గొర్రెల పంపిణీ మీద విచారణకు సిద్ధమా? అని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు.

# వ్యవసాయంపై ఒక్క మంత్రికీ అవగాహన లేదు: జగదీశ్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** వ్యవసాయంపై ఒక్క మంత్రికి కూడా అవగాహన లేదని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. ఆంధ్రా బాసుల మోచేతి నీళ్లు తాగిన వీళ్లకు తెలంగాణ గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. కృష్ణా, గోదావరి నదులు ఆంధ్రా కోసమే పుట్టినట్లు గతంలో పాలకులు వ్యవహరించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మాట్లాడారు. నీటిని ఎలా ఎత్తి పోయాలో తెలిసే కెసిఆర్ కన్నెపల్లి వద్ద పంప్ హౌస్ నిర్మించారని అన్నారు. మేడిగడ్డకు ఏదో జరిగిందని ప్రభుత్వం చెబుతున్నదని తెలిపారు. ఇప్పుడు మేడిగడ్డ వద్ద 10 లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, సింగూరు ప్రాజెక్టులు నీళ్లు లేక ఎండిపోతున్నాయని చెప్పారు. కోదాడ, సూర్యపేట నియోజకవర్గాల్లో రైతులు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. ఎన్డీఎస్ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాకులు చెబుతోందని విమర్శించారు. ప్రభుత్వానికి నీళ్లు ఇచ్చే ఉద్దేశం తమకు లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి కాళేశ్వరంపై నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. ఎన్డీఎస్ఏ హైదరాబాద్ రాకుండా ఢిల్లీ నుంచే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పినట్లు రిపోర్ట్ ఇచ్చిందని ఆరోపించారు.

## బోనాల పండుగ సందర్భంగా
# పాఠశాలల్లో ఆధ్యాత్మిక శోభ



**విశ్వంభర, ఎల్బీ నగర్ :** హైదరాబాద్‌లో బోనాల పండుగ సందర్భంగా పాఠశాలల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. స్కూళ్లన్నీ దేవతామూర్తులతో నిండిపోయాయి. ఆదివారం నగర వ్యాప్తంగా బోనాల పండుగ జరిపేందుకు ఆలయాలు అన్నీ సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్కూళ్లలో బోనాల సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థినీ, విద్యార్థులు దేవతామూర్తులు, పోతురాజుల వేష ధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారి విద్యార్థినీలు నవదుర్గా మాతల అవతారాల్లో మెరిసిపోయారు. గ్రామ దేవతలే దిగొచ్చారా అన్నరీతిలో మైమరిపించారు. విద్యార్థులు పోతురాజుల విన్యాసాలతో అలరించారు. ఆర్‌కే పురం నారాయణ హైస్కూల్‌లో బోనాల సెలెబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ నీరజ, వైస్ ప్రిన్సిపల్ స్వర్ణలత, ఏవో రమేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులు అందంగా ముస్తాబై ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా పోతురాజుల విన్యాసాలు, నవ దుర్గమాతల అవతారాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థికి కలెక్టర్ చేయూత

- ఐఐటి సీటు ఫీజు చెల్లించిన సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి
- ప్రతిభ గల నిరుపేద విద్యార్థులకు ప్రోత్సహించేందుకు ముందుంటా
- చదువుకు పేదరికం అడ్డుకాదన్న కలెక్టర్



**విశ్వంభర, సిద్దిపేట:** గొప్ప చదువు, గొప్పు ఉద్యోగమే కాదు తన మనిషి, మనసు గొప్పదేనని నిరూపించుకున్నారు సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి. చదువు విలువ తెలిసిన ఆయన జిల్లా పాలనాధికారిగా ఏ విద్యార్థి పాఠశాలలకు దూరం కాకుండా చూస్తున్నారు. విద్యాబుద్ధులే బంగారు భవిష్యత్ కు బాటలు వేస్తాయంటూ విద్యార్థులకు బడిబాట పట్టిస్తున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను గాడిలో పెట్టి పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూస్తున్నారు కలెక్టర్ మను చౌదరి. జిల్లా పాలనాధికారిగానే కాదు వ్యక్తిగతంగానూ విద్యార్థులకు సాయం చేస్తూ తన గొప్ప మనసును చాటుకుంటున్నారు మను చౌదరి. ఓ నిరుపేద విద్యార్థి ఉన్నత చదువు కోసం ఆర్థిక సాయం చేసి 'శభాష్ కలెక్టర్ సాబ్' అనిపించుకున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకిరేకొమ్ముల గ్రామానికి చెందిన ఆర్యన్ రోషన్ ది నిరుపేద కుటుంబం. అతడి చిన్నపుడే తండ్రి మృతిచెందాడు. తల్లి రాజమణి దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ అతడిని చదివిస్తోంది. చిన్నప్పటి నుండి తల్లి కష్టాలను చూసి పెరిగిన ఆర్యన్ తమ బ్రతుకులను తన చదువే మారుస్తుందని బలంగా నమ్మాడు. దీంతో అతడు ఎంతో పట్టుదలతో చదివి పాఠశాల విద్యను అత్యుత్తమ మార్కులతో పూర్తి చేసుకున్నాడు. ఆర్యన్ చిన్నతనం నుండి ప్రభుత్వ పాఠశాలలోనే చదుతున్నాడు. కోహెడలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుండి పదో తరగతి పూర్తిచేసుకున్నాడు. 10/10 జిపి సాధించి జిల్లాస్థాయిలో సత్తా చాటాడు. అంతేకాదు ఎంతో కష్టపడి చదవి ఇంటర్మీడియట్ లోనూ 93శాతం మార్కులు సాధించాడు. ఆ తర్వాత జేఈఈ రాసిన అతడు ఐఐటిలో సీటు పొందాడు. తిరుపతి ఐఐటిలో అతడికి సీటు లభించింది. శుక్రవారం రోషన్ ను సిద్దిపేట కలెక్టరేట్ కు పిలిపించుకున్న కలెక్టర్ మనుచౌదరి. అతడి నుండి పూర్తి వివరాలు తీసుకున్నారు. ప్రస్తుతం తనకు తిరుపతి ఐఐటిలో కెమికల్ ఇంజనీరింగ్ సీటు వచ్చింది. కానీ అందులో చేరాలంటే ఫస్ట్ సెమిస్టర్ ఫీజు కట్టాల్సి వుంటుందని తెలిపాడు రోషన్. దీంతో వెంటనే ఫీజు కట్టేందుకు అవసరమైన రూ.36,750 చెక్కును అందించడమే కాదు రూ.40 వేల విలువైన ల్యాప్ ట్యాప్ ను అందించారు కలెక్టర్. తనకు సాయంచేసిన కలెక్టర్ మను చౌదరికి రోషన్ ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ...చదువుకు పేదరికం అడ్డుకాదని రోషన్ లాంటి విద్యార్థులు నిరూపిస్తున్నారని అన్నారు. ఇలాంటి ప్రతిభగల నిరుపేద విద్యార్థులకు ప్రోత్సహించేందుకు తాను ముందుంటానని అన్నారు.





# మూడో రోజు కొనసాగిన ఫోటో ఎక్స్‌పో

**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని కేబిఆర్ కన్వెన్షన్ హాల్లో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఫోటో ఎక్స్ పోను భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఛామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య సందర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# లాడియా డైమండ్ స్టోర్ ప్రారంభం

విశ్వంభర, హైదరాబాద్: పంజాగుట్ట తేజస్వి ప్లాజాలో ఏర్పాటు చేసిన లాడియా రెండో స్టోర్‌ను మాజీ పార్లమెంటు సభ్యుడు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, టీపీసీసీ జాతీయ అధికార ప్రతినిధి మధు యాస్కిగౌడ్, ప్రముఖ సిని నటి శ్రీమతి సంయుక్త మీనన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరి విలేకరులతో మాట్లాడుతూ.. భారతదేశం వజ్రాల ల్యాబ్ -గ్రోన్ వజ్రాల రంగంలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. ఈ రంగంలో వినూత్న ఆలోచనలతో విభిన్న ఆవిష్కరణలకు లాడియా కట్టుబడి ఉన్నాదని తెలియజేయడానికి సంతోషిస్తున్నామన్నారు. లాడియాలో తయారు చేయబడిన బంగారు వజ్ర ఆభరణాలు విస్తృత ఎంపికతో లభిస్తాయని, నెక్లెస్‌లు, బ్యాంగిల్స్, పెండెంట్‌లు, కంకణాలు, చెవిపోగులు, ఝుమ్‌కాస్, ఉంగరాలు ప్రత్యేకమైన ల్యాబ్లో పోల్కిస్, కస్టమైజేషన్-మేక్ యూరోన్ డిజైన్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ వజ్రాల ఆభరణాలు డైమండ్ గ్రేడింగ్ సర్టిఫికేషన్‌లో గ్లోబల్ అథారిటీ అయిన IGI నుంచి ధృవీకరించినట్లు పేర్కొన్నారు. వినియోగదారులకు క్యారెట్ డైమండ్ ధర రూ. 24,999 (EF-VVS)తో విభిన్న సేకరణలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.






# కాలేయ వ్యాధుల పట్ల అవగాహన అవసరం

## నేడు ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం



కాలేయం.. మెదడు తరువాత శరీరంలో రెండో అతిపెద్ద, రెండో అత్యంత క్లిష్టమైన అవయవం. కాలేయం జీవక్రియలను, జీర్ణవ్యవస్థను నియంత్రించుటలో, శరీరంలోని వ్యర్థపదార్థాలను తొలగించుటలో ఎంతగానో సహాయం చేస్తుంది. రోగ నిరోధక శక్తి, జీర్ణక్రియ, జీవక్రియ, గ్రహించిన పోషకాల నిల్వ, విసర్జనకు సంబంధించిన కీలకమైన విధులను నిర్వహించడానికి ఇది బాధ్యత వహిస్తుంది.ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం (హెపటైటిస్) ప్రతి ఏటా జూలై 28న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వైరల్ హెపటైటిస్ గురించి అవగాహన పెంచడం, హెపటైటిస్ నిర్మూలించేలా ప్రపంచం నలుమూలల ఉన్న ప్రజలను ప్రోత్సహించడం, అలాగే హెపటైటిస్ తో బాధపడుతున్న లక్షలాది మందిని గుర్తించే లక్ష్యంతో ఈ రోజును ఏర్పాటు చేశారు. హెపటైటిస్-బి వైరస్ ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త బారుచ్ శామ్యూల్ బ్లూమ్‌బర్గ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజు (జూలై 28) నాడు జరుప బడుతుంది. ప్రతి సంవత్సరం 100కి పైగా దేశాలలో ప్రదర్శనలు, ప్రచారాలు, కచేరీలు, టాక్ షోలు, ఫ్లాష్ మాబ్స్, టీకా డ్రైవ్‌లు వంటి కార్యక్రమాలు నిర్వహించ బడుతాయి.

2004, అక్టోబరు 1న యూరోపియన్, మిడిల్ ఈస్టర్న్ పేషెంట్ గ్రూప్స్, బేబీ మురియెల్ సమన్వయంతో అంతర్జాతీయ హెపటైటిస్ సి అవగాహన దినోత్సవం జరిగింది. వేరువేరు సమూహాలు వేర్వేరు తేదీలలో ఈ దినోత్సవాన్ని జరుపుకున్నాయి. ఈ కారణంగా 2008లో వివిధ ప్రాంతాలలోని రోగుల సమూహాల సహకారంతో ప్రపంచ హెపటైటిస్ అలయన్స్ సంస్థ మే 19ను మొదటి ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవంగా ప్రకటించింది.కాలేయ వ్యాధి దినోత్సవం నిర్వహించాలన్న ఆలోచన కటక్ లో వచ్చింది. హెపటైటిస్-బి వైరస్ ను కనుగొన్న నోబెల్ బహుమతి గ్రహీత శాస్త్రవేత్త బారుచ్ శామ్యూల్ బ్లూమ్‌బర్గ్ గౌరవార్థం ఆయన పుట్టినరోజైన జూలై 28న ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని కటక్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ ప్రతిపాదించాడు. 2010, మే నెలలో జరిగిన 63వ ప్రపంచ ఆరోగ్య సభలో ఈ ప్రతిపాదన ఆమోదించబడి, జూలై 28న పంచ కాలేయ వ్యాధి దినోత్సవంగా ప్రకటించ బడింది.కాలేయ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వందల మిలియన్ల ప్రజలపై ప్రభావితం చూపిస్తుంది. ఈ వ్యాధి తీవ్రత వల్ల దీర్ఘకాలిక వ్యాధికి గురై ప్రతి సంవత్సరం 1.34 మిలియన్ల మంది చనిపోతున్నారు. బాధితుల్లో 12.22 శాతం మంది 30 ఏళ్లలోపు వారుంటే... 40 ఏళ్లలోపు వారు 25.8 శాతం, 50 ఏళ్లలోపు వారు 28.10 శాతం, 60 ఏళ్లలోపు వారు 21.74 శాతం ఉండడం గమనార్హం. సాధారణంగా మద్యం, మాంసం, ఆయిల్ ఫుడ్ అతిగా తీసుకునేవారే ఎక్కువగా కాలేయ జబ్బుల బారిన పడుతుంటారు. ఆశ్చర్యకరమైన అంశమేమిటంటే కనీస/తక్కువ బరువుతో ఉన్నవారు... ఎలాంటి దురలవాట్లు లేనివారు సైతం ప్రస్తుతం ఫ్యాటీ లివర్‌తో బాధ పడుతున్నారు. ఇలా ప్రతి 10 మందిలో ఐదారుగురు ఈ సమస్యతో బాధ పడుతుండడం ఆందోళన కలిగించే అంశం. మద్యపానం, ధూమపానం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఊబకాయం మొదలైన వాటితో సహా జన్యు లేదా జీవనశైలి కారకాలు కాలేయానికి హాని కలిగిస్తాయి. కాలేయ మార్పిడి తప్పనిసరి అయిన పరిస్థితుల్లో, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అవసరమైన వారికి తమ కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చినా... వయసు, బ్లడ్‌గ్రూప్ మ్యాచింగ్ కావడం లేదు. ఒకవేళ మ్యాచ్ అయినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కడా లైవ్ డోనర్ సర్జరీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో చికిత్సలు జరగడం లేదు.

నిల్వ ఉంచిన ఆహార పదార్థాలలో ఎక్కువ శాతం కృత్రిమ క్రొవ్వులు, కృత్రిమ చక్కెరలు ఉంటాయి, ఇవి ఆరోగ్యం పై పెను ప్రభావాన్ని చూపించ గలవు. ఊబకాయం, అస్తవ్యస్త జీవ క్రియలు, జీర్ణాశయ పని తీరు మందగింపు, మూత్రాశయ సంబంధిత సమస్యలు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు హెచ్చు మీరడం, రక్త పోటు, హృదయ సంబంధిత వ్యాధులు మొదలైన వాటికి కారణం అవుతుంటాయి.

# బహుముఖ ప్రజ్ఞాశాలి రావి కొండల రావు

## నేడు రావి కొండల రావు వర్ధంతి



విలక్షణ నటుడు, రచయిత, దర్శక నిర్మాత, సాహితీవేత్త, పాత్రికేయుడు రావి కొండలరావు. సినిమా రచనలే కాకుండా ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, జ్యోతి, రచన, యువ, ఉదయం, పుస్తకం, విపుల మొదలైన వివిధ పత్రికలలో రచనలు చేశారు. హాస్య రచయితగా గుర్తింపు పొందారు. సుకుమార్ అనే కలంపేరుతో కూడా కొన్ని రచనలు చేశారు. ఆయన 1932, ఫిబ్రవరి 11న సామర్లకోటలో జన్మించారు. తండ్రి పోస్టుమాస్టరు పదవీ విరమణ తర్వాత శ్రీకాకుళంలో స్థిరపడ్డారు. వీరి పూర్వీకులు శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు కావడంతో వీరు తండ్రి పదవీ విరమణ తర్వాత స్థిరపడ్డారు. కాకినాడలో మద్రాసు ఆనందవాణి పత్రికలో సర్‌ఎడిటర్ గా పని చేశారు. కొన్నాళ్ళు రమణ గారింట్లో ఉన్నారు.

కొన్నాళ్ళు కేరళ వెళ్ళి, ఒక మలయాళం సినిమాకు డబ్బింగ్ డైలాగులు రాశారు. నరసరాజుగారి సిఫార్సు ద్వారా కొండలరావుకు పొన్నలూరి బ్రదర్స్ వారి సినీ సంస్థలో స్టోరీ డిపార్ట్మెంట్లో ఉద్యోగం వచ్చింది. కామేశ్వరరావు సిఫార్సుతో శోభ సినిమాలో కొండలరావు సినీ నటుడుగా తొలిసారి కనబడ్డారు. ఆయనకు రాధాకుమారితో వివాహం అయింది. ఇద్దరూ తమిళ సినిమాలకు డబ్బింగ్ చెప్పేవారు. సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్గా అవస్థలు పడేకంటే వేషాలే వెయ్యరాదా అని ముళ్ళపూడి వెంకటరమణ అనేవారట. ఆదుర్తి సుబ్బారావు తీసిన 'దాగుడు మూతలు' సినిమాలో డాక్టరు వేషం లభించింది. విజయచిత్ర సినీ మాసపత్రికలో ఎడిటర్ చేశారు. రాధాకుమారి జన్మించినది విజయనగరంలో. ముందు 'ముగ్గురు వీరులు' సినిమాలో ఆమె డబ్బింగ్ చెప్పింది. కొండలరావు ఇంట్లోనే ఆమె తన తండ్రిగారితో వుండేది. అభిరుచులూ, వ్యాపకాలూ ఒకటే కావడంతో కొండలరావు, రాధాకుమారి ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. ఆమె తొలి చిత్రం తేనె మనసులు. 1958 నుండి 2008 వరకు సినిమాలలో విభిన్న పాత్రలు పోషించి, ఒక ఇమేజ్ ను సొంతం చేసుకొన్నారు. అలాగే నీతిచంద్రిక, హ్యూమరథం (రెండు భాగాలు), మల్లీశ్వరి (సినిమా నవల), రావి కొండలరావు నాటికలు, రావి కొండలరావు కథలు, నాగావళి నుంచి మంజీర వరకు తదితర పుస్తకాలు రచించారు. రాష్ట్ర ప్రభుత్వ తామ్ర నంది పురస్కారం, 2004 సంవత్సరానికి అ.జో-వి.భొ. కందాళం ఫౌండేషన్ వారిచే జీవిత సాఫల్య పురస్కారం లభించాయి. జులై 28, 2020న 88ఏళ్ళ వయస్సులో తుది శ్వాస విడిచారు.

- పి.వెంకటరమణ,
9550839444

# ఆగస్టు నెలలో ప్రధాని ఉక్రెయిన్ పర్యటన

- జాతీయ మీడియాలో కథనాలు
- దేశాధ్యక్షుడు జెలెన్ స్కీతో భేటీ కానున్నమోడీ
- ఉక్రెయిన్ పై రష్యా సైనిక చర్య తొలిసారి పర్యటన





**ఢిల్లీ:** రష్యా దండయాత్రతో గత రెండేళ్లకు పైగా యుద్ధభూమిలో నలిగిపోతున్న ఉక్రెయిన్ లో భారత ప్రధాని నరేంద్రమోడీ పర్యటించనున్నారు. వచ్చేనెలలో ఆయన కీవ్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూజాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆగస్టు 23న మోడీ ఉక్రెయిన్ వెళ్లి ఆ దేశాధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్ స్కీతో భేటీ కానున్నట్లు సమాచారం. 2022లో ఉక్రెయిన్ పై రష్యా సైనిక చర్య మొదలుపెట్టిన తర్వాత ప్రధాని మోడీ కీవ్ పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఇటీవల ఇటలీ వేదికగా జరిగిన జీ 7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోడీ,జెలెన్ స్కీ భేటీ అయ్యారు.అంతకుముందు భారత్ లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించిన మోడీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు. తీరిక చేసుకొని ఉక్రెయిన్లో పర్యటించాల్సిందిగా మోడీని ఆయన కోరారు. ఈక్రమంలోనే భారత ప్రధాని కీవ్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఈనెల ఆరంభంలో ప్రధాని మోడీ రష్యాలో పర్యటించిన సంగతి తెలిసిందే. రెండు రోజుల పాటు సాగిన ఆ పర్యటనలో ఆ దేశాధినేత వ్లాదిమర్ పుతిన్ తో ఆయన ద్వైపాక్షిక జరిపారు. ఈసందర్భంగా వీరిద్దరూ ఆలింగనం చేసుకున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. దీనిపై జెలెన్ స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు తీవ్ర నిరాశ కలిగించాయని అన్నారు.

# భారత దేశ రాజకీయాలలో అరుదైన నాయకుడు సూదిని జైపాల్ రెడ్డి



**భారత దేశ రాజకీయాలలో అరుదైన నాయకుడు సూదిని జైపాల్ రెడ్డి. రాజకీయాల్లో ఆయనది ప్రత్యేక శైలి. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా.. ఐదుసార్లు ఎంపీగా.. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, దశాబ్దాల రాజకీయ జీవితంలో మేధావిగా, సకల విషయ పరిజ్ఞానిగా, నిగర్విగా, నీతి, నిజాయితీలకు మారు పేరుగా అవిభక్త ఆంధ్ర ప్రదేశ్, దేశ రాజకీయాల్లో తన ప్రత్యేకత చాటిన అనుభవ శాలి ఆయన. విధి ఆయనపై చిన్నచూపు చూసినా, అంగవైకల్యమును జయించి, మానసిక స్థైర్యాన్ని వశం చేసుకుని, సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో కొనసాగిన అలుపెరగని యోధుడు ఆయన. భారత ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా విధించబడిన అత్యాయక స్థితి నిర్ణయాన్ని వ్యతిరేకించి, తామున్న పార్టీకి రాజీనామా చేసి, ఏకంగా పార్టీ అధినేత్రి ఇందిరా గాంధీనే ఎదిరించి ఆమెపై ఎంపీ స్థానానికి ఎన్నికల్లో పోటీకి నిలబడ్డ ధీశాలి ఆయన. ఆయనే రాష్ట్ర రాజకీయాలతో పాటు జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న, తెలంగాణ గర్వించ దగిన మేధావి సూదిని జైపాల్ రెడ్డి.**

## నేడు సూదిని జైపాల్ రెడ్డి వర్ధంతి

సూదిని దుర్గారెడ్డి, యశోదమ్మ దంపతులకు జైపాల్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడుగులలో 1942 జనవరి 16న జన్మించారు. 18 నెలల వయసులో ఉండగానే పోలియో కారణంగా వైకల్యానికి గురయినా, అది ఆయన రాజకీయ జీవన ఆరోహణకు ఎన్నడూ అవరోధం కాలేక పోయింది. మాడుగులతో పాటు నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం కొనసాగించారు. ఉస్మానియా నుండి ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్‌లో పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

**రాజకీయాల్లో అజాత శత్రువు..**

జైపాల్ రెడ్డి నాలుగు సార్లు శాసన సభ్యునిగా, జనతా పార్టీ జనరల్ సెక్రెటరీగా, మహబూబ్‌నగర్ ఎంపీగా, మిర్యాలగూడ ఎంపీగా, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా , రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, పాలు మార్లు కేంద్ర మంత్రిగా, పని చేసిన విశేష అనుభవ శాలి. ఎమర్జెన్సీ ప్రకటనను వ్యతిరేకించడం, కాంగ్రెస్ హైకమాండ్‌కి ఆయన ఎదురు తిరగడం, ఇందిరా గాంధీ కి ఎంపీ స్థానానికి పోటీ చేయడం ఆయన ప్రత్యేకతలు. చట్ట సభలలో చేసిన డిబేట్లు అత్యంత కీలకమైనవిగా ఉంటాయని ప్రశంసలు అందుకున్నారు. పార్టీలకు అతీతంగా నేతలతో చనువు పెంచుకున్న, ప్రేమను పంచుకున్న గొప్ప నాయకుడు జైపాల్ రెడ్డి. రాజకీయాల్లో అజాత శత్రువు మెలిగారు.

నల్గొండ జిల్లా దేవరకొండలో ప్రాథమిక విద్యాభ్యాసం సాగించిన జైపాల్ రెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎంఏ ఇంగ్లీష్ పట్టా తీసుకున్నారు.ఉస్మానియాలో విద్యార్థి నాయకుడిగా ఉండగానే జైపాల్ రెడ్డి రాజకీయ జీవితం ప్రారంభం అయింది. కాంగ్రెస్ పార్టీలో చేరి, 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. ఆ తర్వాత మరో మూడు సార్లు కూడా ఇదే నియోజక వర్గానికి ఆయన ఎమ్మెల్యేగా పనిచేశారు.1975లో ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించగా, దీన్ని వ్యతిరేకిస్తూ జైపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. జనతా పార్టీలో చేరి, 1980లో ఇందిరా గాంధీపై మెదక్ ఎంపీ స్థానంలో పోటీకి దిగారు. అయితే, ఆయనకు ఓటమి చవి చూశారు. 1984లో జైపాల్ రెడ్డికి పార్లమెంటులో సభ్యుడిగా అడుగుపెట్టే అవకాశం తొలిసారి వచ్చింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఆయన గెలిచారు.

1985 నుంచి 1988 వరకు జైపాల్ రెడ్డి జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత విభేదాల వల్ల ఆయన జనతా దళ్‌లో చేరారు.1990, 1996లో రాజ్యసభ ఎంపీగా ఎంపికయ్యారు. 1991 నుంచి 1992 వరకూ రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. 1998లో జనతాదళ్ (సెక్యులర్) తరఫున మహబూబ్ నగర్ ఎంపీగా రెండో సారి ఎన్నికయ్యారు. అదే ఏడాది ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పురస్కారం కూడా ఆయన అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీ ఆయనే.1999లో జైపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. వరుసగా 1999, 2004లలో ఆ పార్టీ తరఫున మిర్యాలగూడ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2000 వరకు సభాహక్కుల ఉల్లంఘన కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. జైపాల్ రెడ్డి పలుమార్లు కేంద్ర మంత్రిగానూ పనిచేశారు. ఇంద్ర కుమార్ గుజ్రాల్ నేతృత్వంలో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో, ఆ తర్వాత మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాల్లో జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రి పదవులు చేపట్టారు.

2004లో యూపీఏ తొలి ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడ నుంచీ గెలిచి, తిరిగి కేంద్ర మంత్రిగా పనిచేశారు జైపాల్ రెడ్డి. 2009లో యూపీఏ రెండో ప్రభుత్వ హయాంలో చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచీ ఎన్నికై... పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రిగా పని చేశారు. 2012-2014 మధ్య కాలంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా కూడా చేశారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహా మరికొన్ని శాఖలకు మంత్రిగా పని చేశారు. పని చేయడమే తప్ప ప్రతిఫలం ఆశించని నేతగా ముద్రపడ్డ జైపాల్ రెడ్డికి పదవులు వెతుక్కుంటూ వచ్చాయి.

**తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర..**

తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన ప్రధాన అంతర్గత పాత్ర పోషించారు. తెలంగాణ నుండి కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా, సోనియా గాంధీ కి విశ్వసనీయునిగా, ప్రత్యేక రాష్ట్ర సాధనలో బహిర్గతం కానీ ఆయన పాత్ర ఎన్నదగినది. రాష్ట్ర విభజన నివారణకై, ఆయనకు ముఖ్య మంత్రి పదవి ఇవ్వ జూపినా, ప్రజల ఆకాంక్షల దృష్ట్యా ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించారనే ప్రచారం ఉంది.జైపాల్ రెడ్డి హైదరాబాదు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో చికిత్స పొందుతూ 2019, జూలై 28న మరణించారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



# యాదాద్రి జిల్లాను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల భారత కమ్యూనిస్టు పార్టీ విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం జేఎస్ ఫంక్షన్ హాల్ లో మారుపాక వెంకటేశం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో యాదాద్రి జిల్లాలో ఉన్న అనేక సాగునీటి విషయంలో బునాదిగాని కాల్వ, పిలాయిపల్లి కాలువ, బస్వాపురం గంధమల్ల రిజర్వాయర్లు, మూసి ప్రక్షాళనకు ఒక రూపాయి కూడా రాష్ట్ర బడ్జెట్లో పెట్టలేదని, జిల్లా అభివృద్ధి కోసం బడ్జెట్లో నిధులు కేటాయించడం విస్మరించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే గొప్ప యాదాద్రి దేవాలయం నిధులు లేక పనులు ఆగిపోయాయని వచ్చిపోయే వేలాదిమంది భక్తులకు సౌకర్యాలు కనిపించడానికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలి అన్నారు. జిల్లాలో ఆరు మున్సిపాలిటీలు వెనుకబడి ఉన్నాయి. ప్రతి మున్సిపాలిటీకి కనీసం 100 కోట్లు రూపాయలు బడ్జెట్లో ఇవ్వలేదని అన్నారు. జిల్లాలోని శాసనసభ్యులు అధికార పార్టీలో ఉన్నారు కాబట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు తేవాలని కోరారు. శాసన సభ్యులు ఈ విషయంలో చొరవ తీసుకోకపోతే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. బునాది గాని కాలువను తక్షణమే పూర్తి చేయడానికి ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ఈ బడ్జెట్ సమావేశాల అనంతరం పూర్తి చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేయడానికి సీపీఐ సిద్ధంగా ఉందని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు మాట్లాడుతూ మండల హెడ్ కోటర్‌లో గల భువనగిరి బస్ స్టాప్ నుండి ఊరిలోకి వెళ్లే రోడ్డు శివాలయం వరకు వర్షాల వల్ల అధ్వానంగా మారి కనీసం వాహనాలు రాకపోకలకు ప్రమాదంగా ఉందని అదే విధంగా రహీంఖాన్ పేట స్టేజి వద్ద సుమారు పది గ్రామాలకు కేంద్రంగా ఉండడం వల్ల ఆర్టీసీ అధికారులు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఎస్ ఆర్ లో స్టాఫ్ గా నమోదు చేసి బస్సులు ఆపే విధంగా చూడాలని ఇట్టి సమస్యలు పరిష్కారం కానీ యెడల భవిష్యత్తులో భారత కమ్యూనిస్టు పార్టీ ఆందోళన కార్యక్రమాలకు సన్నద్ధం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘం రాష్ట్ర నాయకులు పాశికంటి లక్ష్మీనరసయ్య, కుసుమాని హరిచంద్ర, మండల కార్యదర్శి జల్ది రాములు, జక్క దయాకర్ రెడ్డి, మహిళా సంఘం గౌరవ అధ్యక్షులు గుర్రం రాజమణి, సోలిపురం లింగారెడ్డి, సుల్తాన్ పురుషోత్తం యాసబుచ్చిరెడ్డి, కసరబోయిన సత్తయ్య, కల్వల నరసయ్య, మారుపాక అంజయ్య, ఎండి నయీం, మారుపాక యాదయ్య, మల్లేశం, సోమనబోయిన నరసింహా పాల్గొన్నారు.

# బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం శనివారం వైబీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మండలంలో ఉన్న పలు సమస్యల గురించి చర్చించారు. పలు తీర్మానాలు ఆమోదించడం జరిగింది. ముఖ్యంగా అసంపూర్తిగా ఉన్న బునాది గాని కాలువ తక్షణమే పూర్తి చేయాలని. రైతాంగానికి సాగు నీరు అందించాలని. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా తక్షణమే సాగునీరు అందించాలని. సారగండ్లగూడెం, మోదుగుబావి గూడెం బీటీ రోడ్డు నిర్మించాలని వాగుల పైన వంతెనలు నిర్మించాలని పలు తీర్మాలను ఆమోదించడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బొట్టు అబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బల ఇంద్రారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారు సత్యనారాయణ, జిల్లా నాయకులు బొట్టు కృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, మండల ప్రధాన కార్యదర్శి తవిటి రాంరెడ్డి, మండల ఉపాధ్యక్షులు చంద్రారెడ్డి, బండ సోమయ్య, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీహరి, కిసాన్ మోర్చా అధ్యక్షులు ఆంబోజు ఆంజనేయులు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మేడి సాగర్, మండల కార్యదర్శి బూడిద నరసింహ, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, ఎస్సీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మధు, సోషల్ మీడియా మండల కన్వీనర్ సాయి, భూతు అధ్యక్షులు లోడి వెంకటయ్య, విజయ్, మహేష్, గణేష్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కల్వల వెంకటేష్, కృష్ణమూర్తి, భాస్కర్ రెడ్డి, సూర్య పాల్గొన్నారు.

# మోత్కూర్‌ను అసెంబ్లీ నియోజకవర్గంగా ప్రకటించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ ఆధ్వర్యంలో మోత్కూర్ రెవెన్యూ డివిజన్ చేయాలని, అసెంబ్లీ నియోజక వర్గాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ మండల పార్టీ ఆద్వర్యంలో మండల తాసిల్దార్ రవికుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు బొట్టు అబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి బొబ్బల ఇంద్రారెడ్డి, జిల్లా నాయకులు బొట్టు కృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి బండారు సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి తవిటి రామిరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీహరి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఆంబోజు ఆంజనేయులు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి లోడి మహేష్ గౌడ్, మండల కార్యదర్శి బూడిద నరసింహ, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మేడిసాగర్, బూత్ అధ్యక్షులు వెంకటయ్య, చంద్రా రెడ్డి, విజయ్, సూర్య, సాయి, రాఘవేందర్ రెడ్డి, కల్వల వెంకటేష్ పాల్గొన్నారు.

# సింగరేణి ఉపరితల ఘని బ్లాస్టింగ్ ఇబ్బందులపై కమిటీ ఏర్పాటు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి మండలం గుర్రంపేట ఎస్సీ కాలనీలో సింగరేణి బ్లాస్టింగ్ వల్ల ఏర్పడుతున్న ఇబ్బందుల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, సింగరేణి అధికారులతో గుర్రంపల్లి గ్రామంలో సింగరేణి సంస్థ ఉపరితల ఘని వల్ల ఏర్పడుతున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ, వ్యవసాయ శాఖ, పంచాయతి అధికారి, పరిశ్రమల శాఖ జీఎం, కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ శాఖ, ఆర్డీఓ ఎంపీడీఓ లతో కమిటీ ఏర్పాటు చేశామని, అట్టి కమిటీ గ్రామంలో పర్యటించి 15 రోజుల్లో నివేదిక అందచేయాలని ఆదేశించారు. గుర్రంపేట గ్రామశివారు ఎస్సీ కాలనీ ప్రజలు సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఉపరితల ఘని వల్ల ఇళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయని, బ్లాస్టింగ్ వల్ల పెద్ద పెద్ద రాళ్లు వస్తున్నాయని కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతూ జీవనం సాగించాల్సి వస్తుందని తమకు న్యాయం చేయాలని చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికలు అందచేయాలని పేర్కొన్నారు. బ్లాస్టింగ్ ప్రభావంతో ఏ మేరకు నష్టం వాటిల్లుతుందో, అంచనా వేసి కమిటీ పూర్తి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగిలాల్, తహసీల్దార్ శ్రీనివాసరావు, సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

# ఉత్తమ సేవకు గుర్తింపుగా నారీ శక్తి పురస్కారం




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రానికి చెందిన తవిటి స్వప్న వెంకటేశ్వర్లు, పాశం శ్యామల లింగారెడ్డి, మోటా కొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నూనెముంతల పద్మ సంతోష్, గత కొన్ని సంవత్సరాలుగా మహిళా సంఘాలకు ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు, నాంచారిపేట గ్రామానికి చెందిన కంది చంద్ర కళ రెడ్డి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు జర్నలిస్ట్ రంగంలో ప్రతిభ కనబరిచినందుకు గాను హైదరాబాదులోని సుప్రభాత్, హబ్సిగూడలోని శ్రీ ప్రగతి ఫౌండేషన్, వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవ అవార్డు కార్యక్రమంలో బాగంగా నారి శక్తి పురస్కారం అందుకున్నారు. సినీ ప్రముఖులు దొరై స్వామి, సినీ హీరోయిన్ వాన్య అగర్వాల్, చిక్కడపల్లి సీఐ సీతయ్య, వీఆర్ శ్రీనివాస రావు, మధుకర్‌గౌడ్‌ల చేతుల మీదుగా వారు నారి శక్తి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నారీ శక్తి పురస్కారం అందుకున్న వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని అవకాశాలు కల్పిస్తున్న వాటిని వినియోగించుకోవడంలో మహిళలు వెనుకబడుతూనే ఉన్నారని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు మా మహిళా సంఘాలు నిరంతరం వారికి చైతన్య పరచడానికి కృషి చేస్తున్నాయని అన్నారు. మా సేవలకు గుర్తించి పురస్కారం అందించిన వల్లూరి, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ లకు, కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా బాధ్యతలు నెరవేరుస్తామని తెలిపారు.

# హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఇ.వీ. వేణుగోపాల్, జస్టిస్ కే సుజనాని శనివారం ప్రెసిడెన్షియల్ సూట్స్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. యాదగిరిగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్, మొదటి తరగతి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్, కోర్టు ప్రారంభోత్సవనికి ముఖ్యఅతిథిగా విచ్చేసినసందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన కోర్టును ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# సాయిబాబాను దర్శించుకున్న కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయి సన్నిధి దేవాలయాన్ని శనివారం కుటుంబ సమేతంగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ వారికీ ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి బాబా చిత్రపటాన్ని అందచేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు నిత్యం సాయినాధుని దర్శించుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. వారి వెంట ఆర్డీఓ శ్రీరాములు, చింతపల్లి ఎమ్మార్వో విజయకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనుంజయ, ఆలయ కమిటీ సభ్యులు, కుంభం పుల్లారెడ్డి, కొమిరెడ్డి వెంకటయ్య, పూరే కృష్ణయ్య, చింతపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, ఎంపీటీసీ సదానందం ఉన్నారు

# ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం మహిళా శిశు దివ్యాంగ వయోవృద్ధుల సంక్షేమ శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో మహిళా సాధికారిత మిషన్ జిల్లా కోఆర్డినేటర్ హర్ష కేజీవీపీ పాఠశాలను సందర్శించారు. భేటీ బచావో బేటి పడావో అనే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తూ చదువుతోపాటు, ఆటల్లో కూడా ప్రావీణ్యం సంపాదిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతిభను సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థిని లను ఉద్దేశించి మహిళా సాధికారత మిషన్ జిల్లా కోఆర్డినేటర్ హర్ష మాట్లాడారు. అదేవిధంగా విద్యార్థినిలకు స్పోర్ట్స్ కిడ్స్, సానిటరీ అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు భార్గవి, నిఖిత, మనిషా, కవిత, కేజీవీపి ప్రత్యేక అధికారి శివరంజని పాల్గొన్నారు.



# గోరింటాకు సంబరాలు

**విశ్వంభర, మహాదేవపూర్ :** మహాదేవపూర్ మండల కేంద్రంలోని వాసవి నగర్ లో మహిళలు గోరింటాకు సంబరాలను జరుపుకున్నారు. పోల్సాని సునీత రావు గృహంలో వాడలోని మహిళలంతా కలిసి ఆషాడ మాసంలో చేయాల్సిన గోరింటాకు చెట్టుకు పూజలు చేసి ఆ గోరింటాకును చేతులకు తీర్చిదిద్దుకొని సంబరాలు జరుపుకున్నారు. మహిళలు ఆటపాటలతో అత్యంత ఉత్సాహంగా పాల్గొని ఒకరికి ఒకరు మైదాకును పెట్టుకొని ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుడాల అరుణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పెండ్యాల మమతతో పాల్గొన్నారు.



# తహసిల్దారును సన్మానించిన మైనారిటీ కమిటీ సభ్యులు

**విశ్వంభర, డిండి :** నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రానికి బదిలీపై విచ్చేసిన తహసిల్దార్ అంబటి ఆంజనేయులను శనివారం ముస్లిం మైనారిటీ కమిటీ సభ్యులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ కమిటీ అధ్యక్షులు షేక్ ఉమర్, గౌరవ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, షేక్ ఇస్మాయిల్, షేక్ చాంద్ పాషా, మహమ్మద్ ఖయ్యూమ్, మహమ్మద్ షబ్బీర్, మహమ్మద్ యాసీన్ పాల్గొన్నారు.

# మైనార్టీలకి బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇవ్వడం పట్ల హర్షం



**విశ్వంభర, డిండి :** అసెంబ్లీ సమావేశాల్లో 2024-25 బడ్జెట్ లో ఉప ముఖ్యమంత్రి 3003 కోట్ల రూపాయలు మైనార్టీలకు కేటాయించడం పట్ల డిండి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత పాలకులు ముస్లిం మైనార్టీలకు ఓటు బ్యాంకుగా వాడుకోవడం వలన మైనార్టీలకు చాలా అన్యాయం జరిగిందని అన్నారు. ఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి హాయంలో ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు ఎంతోమంది నిరుపేద ముస్లిం యువకులు ఉద్యోగాలు పొందారని అన్నారు. పేద విద్యార్థు లకు స్కాలర్షిప్లు అందించిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డిదేనని అన్నారు. నాటి నుండి నేటి వరకు ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డిని జన్మలో మరిచిపోలేని వ్యక్తి అని అన్నారు. ఈనాటి తెలంగాణ యువ నాయ కులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీ సమావేశాల్లో ముస్లిం మైనార్టీల అభివృద్ధి కొరకు 3003 కోట్లు కేటా యించడం పట్ల దేవరకొండ నియోజకవర్గ డిండి ముస్లిం మైనారిటీలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దేవర కొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్‌కి, నల్ల గొండ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తంకుమార్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి బడ్జెట్‌లో మైనార్టీలకు అత్యధికంగా బడ్జెట్ కేటాయిం చడంతో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా చిరు వ్యాపారస్తుల కు రుణాలు పొందడానికి ఎంతో అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు షేఖ్ ఉమర్, మహమ్మద్ ఖయ్యూం, బాబా, అవేజ్, ఫాసీన్, యాసీన్ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- మండల ప్రత్యేక అధికారి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికిషన్

**విశ్వంభర, నారాయణఖేడ్ :** గ్రామాల్లో పారిశుద్ధ నిర్వహణపై దృష్టి సాధించి పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని పెద్ద శంకరంపేట మండల ప్రత్యేక అధికారి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికిషన్ అధికారులకు సూచించారు. శనివారం పెద్ద శంకరంపేట కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ సమావేశంలో గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై మురికి నీరు ప్రవహించకుండా చూసుకోవాలని గుంతల్లో నీటి నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని ఎప్పటి కప్పుడు దోమలు మందులు పిచికారీ చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య నియమాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. తడి పొడి చెత్తను వేరువేరుగా డంపింగ్ యార్డ్లకు తరలించాలని అన్నారు. సమావేశానంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పథకాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో తాసిల్దార్ గ్రెసి బాయ్, మండల్ నోడల్ అధికారి వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి వెంకట రాములు వివిధ శాఖల సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయాలి : ఎస్ఎఫ్ఐ




**విశ్వంభర, సూర్యాపేట :** విద్యారంగ సమస్యలను పరిష్కారం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తానన్న రేవంత్ సర్కార్ నిధులు కేటాయించడంలో విఫలమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ ఎనిమిది వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. దీని ద్వారా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్కాలర్షిప్ ఫీజురియంబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా తరగతి గదుల నిర్మాణాలను చేపట్టాలన్నారు. సంక్షేమ వసతి గృహాలలో సీట్ల సంఖ్యను పెంచి వసతి గృహాలకు, గురుకులాలకు పక్కా భవనాల నిర్మించాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. విద్యాసంస్థల్లో, గురుకులాల్లో విద్యార్థుల అనుమానస్పద మృతుల పట్ల సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోత్ వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కంపసాటి విష్ణు, తన్వేష్, అక్కినపల్లి వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.



## బీటీ రోడ్డు నిర్మించి వీరన్నపల్లి బస్సును పునరుద్ధరించాలి

**విశ్వంభర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం వీరన్నపల్లి గ్రామానికి బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సహకారంతో మూడు కోట్ల 40 లక్షల రూపాయలతో దొంగరోడు నుండి గట్టు ఇప్పలపల్లి వరకు నాలుగు కిలోమీటర్లు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి అధికారులు శిలాఫలకం కూడా వేశారని వర్షాకాలంతో రోడ్డు గుంతలు గుంతలుగా తయారైనందుకు మహేశ్వరం డిపో బంద్ బస్సును నడపకుండా ఆపేసిందని గ్రామ ప్రజలు తెలియజేశారు. ప్రజా ప్రతినిధులు ఇకనైనా పట్టించుకుని రోడ్డు వేయించి బస్సు పునరుద్ధరించాలని వీరన్నపల్లి గ్రామ ప్రజలందరూ ముక్త కంఠంతో కోరుతున్నారు.

# కల్వకుర్తి నియోజకవర్గం
## సమస్యలతో ముఖ్యమంత్రికి స్వాగతం

**విశ్వంభర, ఆమనగల్లు :** ఎందరో ఉద్దండులకు రాజకీయ జీవితాన్ని అందించిన కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేకపోయింది. ఇక్కడ గెలిచినవారు కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రులుగా పనిచేశారు. దివంగత ఎన్టీఆర్ను ఓడించిన చరిత్ర కల్వకుర్తి ఓటర్లది. ప్రతీ ఎన్నికల్లో పార్టీలు అనుకున్న దానికన్నా విలక్షణ తీర్పును అందిస్తున్న కల్వకుర్తిలో ఎన్నో జిమ్మిక్కులు కుమ్ములాట లతో అభివృద్ధి ఆటంకంగా నిలిచింది.




### కల్వకుర్తి రాజకీయ చరిత్ర

నియోజకవర్గంలో ప్రసుత్తం 2.30,650 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,17,393 మంది పురుషులు, 1,13,250 స్త్రీలు, ఇతరులు ఏడుగురు ఉన్నారు. 1952లో కల్వకుర్తి నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటివరకు 18 సార్లు ఎన్నికలు జరగగా పదిసార్లు కాంగ్రెస్, 3 సార్లు ఇండిపెండెంట్, 2 సార్లు జనతాదళ్, టీడీపీ రెండు సార్లు, బీఆర్ఎస్ ఒక సారి విజయాన్ని సాధించాయి. నియోజకవర్గంలో కల్వకుర్తి, వెల్దండ, ఆమనల్, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి 2018 అభ్యర్థి జైపాల్ యాదవ్పై గెలుపొందారు. బీజేపీ నుంచి ఆరు సార్లు పోటీ చేసి ఆచారి ఓడిపోయాడు. ఇంకా టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ను ఇక్కడ ఓడించి కల్వకుర్తి చరిత్రలో నిలిచింది. దివంగత జైపాల్ రెడ్డి ఇక్కటి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1984లో ఎంపీగా గెలిచిన జైపాల్ రెడ్డి 2004, 2009లో యూపీఏ ప్రభుత్వంలో కేంద్రమంత్రి పదవి దక్కించుకున్నారు. 1998లో ఇతనికి ఉత్తమ పార్లమెంటేరీయన్ అవార్డు లభించింది. నేడు ఆయన జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై కోట్రా చౌరస్తాలో విగ్రహ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొననున్నారు. ఇక రాష్ట్ర మంత్రులుగా 1962లో లట్టుపల్లి వెంకట్రెడ్డి బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలో, 1989లో చిత్తరంజన్దాస్ కోట్ల విజయభాస్కరెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. జైపాల్యాదవ్ రెండు సార్లు టీడీపీ నుంచి, ఒక సారి బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. 2018లో తన సమీప ప్రత్యర్థి ఆచారిపై 3,447 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. యాదవ సామాజికవర్గానికి చెందిన జైపాల్యాదవ్ సౌమ్యుడిగా, వివాదాలకు దూరంగా ఉంటారనే పేరుంది. అయినా కసిరెడ్డి నారాయణరెడ్డి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విజయ దుందుభి మోగించారు. నియోజకవర్గంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉప్పల వెంకటేశ్గుప్త నియోజకవర్గంలో రాజకీయంలో తనదైన ముద్ర వేసుకొని పెద్ద పాత్ర పోషిస్తున్నారు. మొదటి నుంచి బీఆర్ఎస్లో ఉన్న గోలి శ్రీనివాస్రెడ్డికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ పదవి కట్టబెట్టింది. వీరిద్దరి బలం కూడా తనకు కలిసి వస్తుందని జైపాల్యాదవ్ భావించినా.. చివరికి నిరాశ ఎదురయింది. మరో నేత బాలాజీ సింగ్ బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు వివిధ మండలాల్లో ఆయనకున్న పరిచయాలతో పార్టీని గెలిపించడంలో ముఖ్యపాత్ర పోషించారు. దీనికి తోడు కల్వకుర్తి ప్రాంతానికి చెందిన రేవంత్రెడ్డి కూడా గత ఎన్నికల బహిరంగ సభలో ఆమనగల్లులో పాల్గొని తన సొంత నియోజకవర్గమైన కల్వకుర్తికి తప్పకుండా సేవ చేస్తానని హామీ ఇవ్వడంతో కసిరెడ్డి విజయం నల్లేరు పైన నడకనే అయ్యింది. మొత్తానికి ఏది ఏమైనా గత ప్రభుత్వాలు నియోజకవర్గానికి పెద్దగా చేసింది ఏమీ లేదని ఇప్పుడైనా మన ప్రాంత వాసు ముఖ్యమంత్రి కావడంతో కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు పెద్ద ఆశతో ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గం ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఎప్పుడైనా ప్రభుత్వం ఒకటి ఉంటే ఇక్కడ గెలిచేవారు మరొకటి అవ్వడంతో నిధుల లేమితో నియోజకవర్గ అభివృద్ధి జరగలేదు. సౌమ్యుడైన కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్రెడ్డితో మాట్లాడి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా కల్వకుర్తి ఎత్తిపోతల డీ 82 కాల్వ పనులు వెంటనే పూర్తి చేసి రైతులకు 16 కోట్ల చెల్లించే విషయంలో ఎమ్మెల్యే తీసుకున్న శ్రద్ధ అందరినీ ఆకర్షించింది. అదే విధంగా నియోజకవర్గంలోని డబల్ బెడ్ రూం పథకంలోని లబ్ధిదారులకు ఇండ్లను అందజేయాలని, పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు కొత్త భవనాన్ని నిర్మించాలని, హైదరాబాద్ కల్వకుర్తి జాతీయ రహదారి నాలుగు లైన్లుగా చేయాలని, స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నియోజకవర్గానికి కేటాయించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. ఇంకా ఆమనగల్లు మండల విషయానికొస్తే రెండు జిల్లాలతో పలు సమస్యలతో కనబడుతోంది. వాహన రిజిస్ట్రేషన్లకు షాద్నగర్, ప్లాట్ల రిజిస్ట్రేషన్కు మహేశ్వరం, వివిధ పనులపై తుక్కుగూడ ఇబ్రహీంపట్నం వెళ్ళవలసి వస్తుంది. గత ప్రభుత్వంలో వదిలేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు, పిఏసిఎస్ సొంత భవన నిర్మాణం, కొత్త ఆమనగల్లు పురపాలక సంఘానికి నూతన భవనం, అంగట్లో కూరగాయల విక్రయదారుల నుంచి సతమతమవుతున్న పోలీస్ స్టేషన్ను తరలించి జాతీయ రహదారిపై ఏర్పాటు చేయాలని, తరలించిన నవోదయ గురుకుల పాఠశాలల భవనాల్ని ఇక్కడే ఏర్పాటు చేసి కొనసాగించాలని ఆర్డీఓ, ఎస్టిఓ, ఏసిపి, ఆర్టిఏ ట్రాఫిక్ కార్యాలయాలను నెలకొల్పి రెండు జిల్లాల సమస్యను తీర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇక కడ్తాల్, తలకొండపల్లి, మాడుగుల మండలాల్లో ఉన్న అనేక సమస్యలను ఎమ్మెల్యే కసిరెడ్డి భుజాలపై వేసుకొని సీఎంతో సమీక్ష జరిపి సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు.

## పేద ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**విశ్వంభర, కామారెడ్డి :** మాచారెడ్డి మండలం ఆరెపల్లి గ్రామానికి చేందిన టి. నర్సయ్య కుమారుడు టి.నవదీప్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అపరేషన్ చేయాలని పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఆ కుటుంబం ఏమి చేయాలో తెలియక కాంగ్రెస్ నాయకులను సంప్రదించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీకి విషయం చెప్పడంతో షబ్బీర్ అలీ వెంటనే స్పందించి నిమ్స్ హాస్పిటల్ డాక్టర్ తో మాట్లాడి నవదీప్ గారికి ప్రభుత్వం తరపు నుండి చికిత్స నిమిత్తం 75,000 రూపాయల ఎల్.ఓ.సి ఇవ్వడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ



సలహాదారులు శ్రీ షబ్బీర్ అలీకి నవదీప్ గారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వరద బాధితులకు పునరావస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



**విశ్వంభర, భద్రాచలం :** భద్రాచలం వద్ద గోదావరికి వరద పెరుగుతున్న సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేస్తున్న గోదావరి వరద బాధితుల కేంద్రాలలో బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ,ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు పాలు గుడ్లు, పోషకాహారం అందించాలని, వరదల వల్ల నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు ఆకోజు సునిల్ కుమార్ అన్నారు. భద్రాచలం పట్టణంలో వరద ప్రభావిత కాలనీలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు వరద సహాయ చర్యలో పాల్గొని బాధితులకు అండగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన వరద బాధితులకు 10,000 రూపాయలు నష్టపరిహారం పెంచి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐనాల రామకృష్ణ, దానియేలు, ప్రదీప్, లక్ష్మణ్, నాగరాజు, చిట్టిమల్ల అనిల్, రామకృష్ణ, రాణి, యాదామని పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో విద్యార్థి మృతి



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఘనవిద్య రాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో ఫిట్స్ వచ్చి కాళ్లు చేతులు వంకర పోవడంతో నైట్ డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయుడు ప్రిన్సిపాల్ విద్యాసాగర్ కు రిపోర్ట్ ఇవ్వడంతో ఉపాధ్యాయునితో తల్లిదండ్రులకు కబురు చేయమని ప్రిన్సిపాల్ చెప్పారు. విద్యార్థికి సీరియస్ ఉన్నది అని తెలాలిసినా ప్రిన్సిపాల్ తన క్వార్టర్ నుండి బయటకు రాలేదు. విద్యార్థి సుమారు రెండు గంటల పాటు నరకయాతన అనుభవించారని తోటి విద్యార్థులు అన్నారు. తండ్రి రాజారపు మహేష్ హుటాహుటిన బయలుదేరి బండిపై ఆసుపత్రికి తరలించే లోపు విద్యార్థి చనిపోయాడు అని డాక్టర్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న గురుకుల పాఠశాల సిబ్బంది ఆసుపత్రికి తీసుకు వెళ్లకుండా కుటుంబ సభ్యులకు బాబును అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కూడా పలువురు విద్యార్థులకు పాములు తేళ్లు కాటు వేసినా విద్యార్థులకు ఎలాంటి రక్షణ కల్పించలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ సంఘటనతో పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. విద్యార్థి మృతి పట్ల విచారణ జరిపి మృతికి కారకులైన, నిర్లక్ష్యం వహించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకొని విద్యార్థి తల్లిదండ్రులు రాజారపు మహేష్ లావణ్య దంపతులకు ఏకైక కుమారుడు రాజారపు ఘనవిద్యకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ఘనంగా ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, చైతన్యపురి :** ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిన్నారం విఠల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ఎల్లప్పుడు ఆయురారోగ్యాలతో చల్లగా ప్రజా సేవలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేకర్ రెడ్డి, పవన్, గట్టు శ్రీనివాస్, ప్రకాష్, రమణ రెడ్డి, శోభారాణి, వీరన్న యాదవ్, అజయ్, కడియం మోహన్, సంతోశ్ యాదవ్, అంజయ్య, నరహరి, శ్రీనివాస్ యాదవ్, మధు, సాయి, నవీన్ యాదవ్, జలేందర్, ప్రమోదు, టింకు, సీనియరు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



**విశ్వంబరా, ఎల్బీనగర్ :** ఆర్కెపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఆదివారం జరిగే బోనాల ఉత్సవాల కార్యక్రమానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ఖిల్లా మైసమ్మ అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారికంగా పట్టు వస్త్ర సమర్పణ కార్యక్రమానికి హాజరవు తున్నట్లు తెలిపారు. మంత్రితో పాటు మహేశ్వ రం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డిలు పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమానికి విచ్చేయు చున్నారని తెలిపారు. రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్‌యుఐ నాయకులు, మహిళా నాయకు రాలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని కోరారు.

## ఆగస్టు 1 నుండి యోగ సాధన శిబిరం



**విశ్వంభర, సరూర్ నగర్ :** గురు నిలయం ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి యోగ సాధన శిబిరం ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ యోగా గురువు స్వధర్మయోగి హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో తెలియజేశారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ప్రముఖ విశ్రాంత న్యాయమూర్తి బీ. జస్టిస్ చంద్ర కుమార్ చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగినది. ఈ యోగ సాధన శిబిరం ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు హుడా కాంప్లెక్స్ సరూర్ నగర్ లో ఉన్నటువంటి లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ నందు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ శిబిరంలో వ్యాయామాలు ప్రాణాయామాలు, ఆసనాలు, ధ్యానం, సూర్య నమస్కారాలు నేర్పించి సాధన చేయిస్తారని తెలియజేశారు. ఈ శిక్షణా తరగతులలో 14 సంవత్సరాల వయసు దగ్గర నుంచి 70 సంవత్సరాలు వయసు కలిగిన ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మానసిక ప్రశాంతతకు సంపూర్ణ ఆరోగ్యానికి యోగ సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని, నిత్యం వాకింగ్ యోగ ధ్యానం వంటి వాటి వలన మనిషి తన ఆరోగ్యాన్ని తాను కాపాడుకోవడం నేటి యుగంలో చాలా అవసరమని బీ. చంద్ర కుమార్ తెలియజేశారు.

ప్రస్తుతం మనుషు లను పట్టిపీడిస్తున్న బీపీ, షుగర్, అల్సర్, మైగ్రేన్, నడుం నొప్పి, వెన్నునొప్పి, సైనస్, సర్వైకల్ స్పాండిలైటిస్, నిద్రలేమి, ఆస్తమా, సమస్యల నుంచి బయటపడడానికి ప్రత్యేక దృష్టి పెట్టి ఈ సాధన శిబిరాన్ని కొనసాగించ నున్నట్లు ఇస్మాయిల్ గురూజీ తెలియజేశారు. ఈ యొక్క సాధనా శిబిరంలో పాల్గొనాలి అనుకునేవారు ఈ 9603256572 నెంబర్ ను సంప్రదించవలసిందిగా కోరారు.



ఖైరతాబాద్ లోని ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ లో జరిగిన కార్యక్రమం లో లయన్స్ అంతర్జాతీయ ప్రెసిడెంట్ ఫాబ్రిసియో ఆలివేరా చేతులమీదుగా స్క్వాడ్రన్ లీడర్ అవార్డు లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ వివేకానందపురం, 'జిల్లా 320బి' ప్రెసిడెంట్ దివ్యదీప్ కౌరా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఏక్త కౌర్ పాల్గొన్నారు. **– విశ్వంభర, ఖైరతాబాద్**

# తెలంగాణ విద్యావంతుల వేదిక ఆద్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ అనిర్వచనీయమైన పాత్రని నిర్వహించినారని దానికి కావలసిన సిద్ధాంత భూమికను ఇచ్చారని తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలియజేశారు. ఆయన మరణానంతరం తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రతి సంవత్సరం ప్రముఖ సామాజికవేత్తలు, విద్యావేత్తలతో స్మారక సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 13 సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని విద్యావంతుల వేదిక కొనసాగిస్తుంది. ఈ సంవత్సరం 2024 జులై 28 ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహింస్తున్నామని తెలిపారు. ఈ సభలో ది వైర్ పత్రిక సీనియర్ ఎడిటర్ అర్ఫాఖానుమ్ శర్వాణి స్మారక ఉపన్యాసమిస్తారు. సామాజిక ఉద్యమకారులు విద్యా వేత్తలు అన్ని వర్గాల ప్రజలు ఈ సభలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి ఘనమైన నివాళి అర్పించాలని డాక్టర్ తిప్పర్తి యాదయ్య కోరారు. ఈ సందర్భంగా స్మారక సభ పోస్టర్ ను సాగరిక స్కూల్ లో ఆవిష్కరించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక నగర ప్రధాన కార్యదర్శి అంకుష్ చరణ్, ప్రొఫెసర్ ఉపేందర్, అభ్యుదయ రచయితల సంఘము రాష్ట్ర నాయకులు కేవీఎల్, రంగారెడ్డి జిల్లా పల్లె వినయ్, నగేష్ అప్ప, కారింగు బిక్షం, తిప్పర్తి మహేష్, ప్రముఖ సినీ గేయ రచయిత అభి ఉప్పల్ లు పోస్టర్ను ఆవిష్కరించారు.

## శ్రీవాణి సాంస్కృతిక సంస్థ కార్యక్రమాలను విస్తరిద్దాం



**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ పట్టణంలోని స్థానిక గణేష్ గార్డెన్ లో శ్రీవాణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పౌరాణిక నాటక పోటీలు నిర్వహించడం జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి విచ్చేసి మాట్లాడారు. పౌరాణిక నాటకాలు, వీధి నాటకాలు ఇప్పుడున్న జనరేషన్ కు, సమాజానికి తెలియదని అన్నారు. శ్రీవాణి సాంస్కృతిక సంస్థ ద్వారా పౌరాణిక, వీధి నాటకాలను, భజన మండలిని ప్రతి గ్రామానికి తీసుకెళ్లిన ఘనత శ్రీవాణి సంస్థ కే చెందుతుందని అన్నారు. శ్రీవాణి సాంస్కృతిక సంస్థ గ్రామాల్లో రెండు వేల భజన మండలీలను ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయం అని అన్నారు. ఈ సంస్థ కు ఏళ్లవేళలా మా సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ నరేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీ బండారి రమేష్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు మహేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య, వెంకట్ రాం రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి, రంగనాథం పాల్గొన్నారు.



ఫరూక్ నగర్ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కోసం రూ.1,01000 రూపాయలు బెంది సురేందర్ బాబు, బెంది సుదర్శన్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సిములుకు విరాలన్ని అందచేశారు. కార్యాక్రమంలో భాగంగా కూమర్ గౌడ్, అప్పి మురళి మోహన్ , మున్సిపల్ కో అప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, భూపాల్, పాల్గొన్నారు.
**– విశ్వంభర, షాద్‌నగర్**

## నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా శంకర్



**విశ్వంభర, హైదరాబాద్ :** నాణ్యత లేని, కల్తీ వస్తువులను దర్జాగా విక్రయిస్తున్న వారిని నిలదీసే హక్కు ప్రతి వినియోగదారునికి ఉందని, వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రంగారెడి జిల్లా అధ్యక్షుడు యాద శంకర్ అన్నారు. యాదాశంకర్‌ను నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ ఎన్.సీ.ఆర్.సీ ఫౌండర్, జాతియ చైర్మన్ డాక్టర్ ఎం.వీ.ఎల్ నాగేశ్వర రావు, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌లు శనివారం హైదరాబాద్ లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో నియామకపు ఉత్తర్వులు అందచేశారు. ఈ సందర్భంగా యాదా శంకర్ మాట్లాడుతూ కొంత మంది స్వార్ధపరులు సొంత లాభం కోసం చిన్నపిల్లలు తాగే పాల దగ్గరి నుండి ప్రాణాపాయ పరిస్థితులలో అందించే ఔషధాల వరకు అన్నిటిని కల్తీచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు కార్పోరేట్ కంపెనీలు, బడా వ్యాపార సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్ లు నిర్లక్ష్యంతో కాలం చెల్లిన నాణ్యత లేని వస్తువులను విక్రయిస్తున్నాయని ప్రతి రోజు పత్రికల్లో చూస్తూనే ఉన్నామని ఇలాంటి పరిస్థితులను అడ్డుకునేందుకు ఎన్.సీ.ఆర్.సీ వినియోగదారులకు అండగా ఉంటుదని శంకర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా వినియోగదారులు తనను సంప్రదించాలని శంకర్ కోరారు. చట్ట పరంగా తమ హక్కులను కాపాడుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడి కల్తీభూతాన్ని తరిమి కోట్టాలని పిలుపు నిచ్చారు. తనకు పదవి ఇచ్చిన ఎన్.సీ.ఆర్.సీ ఫౌండర్, జాతియ చైర్మన్ డాక్టర్ ఎం.వీ.ఎల్ నాగేశ్వర రావు, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ లకు యాదా శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.



గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి బడ్జెట్లో పది వేల కోట్ల రూపాయలు కేటాయించిన సందర్భంగా శనివారం సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. **– విశ్వంభర, కూకట్‌పల్లి**



## బోనాల ఉత్సవాల కార్యక్రమానికి ఆహ్వానం

**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురిలో ఆగస్టు 1 వ తేదీన నిర్వహించే బోనాల ఉత్సవాల కార్యక్రమం, పలహార బండి కార్యక్రమానికి హాజరుకావాలని రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు శ్యామ్ గుప్తాకి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, పగడాల దీపక్, మౌర్య రెడ్డి, కిట్టు, మహేష్ పాల్గొన్నారు.

## హామీల అమలుకు పెద్దపీట వేసిన తెలంగాణ బడ్జెట్



**విశ్వంభర, సరూర్ నగర్ :** సరూర్ నగర్ హామీల అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో పెద్దపీట వేసిందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నా రు. శనివారం ఆయన మాట్లాడుతూ సంక్షేమం, వ్యవ సాయం, సాగునీరు, పంచాయతీరాజ్ రంగాలకు, భారీ కేటాయింపులు చేయడం అభినందించదగ్గ విషయమని అన్నారు. మరో పక్క తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరు అయిన హైదరాబాద్ అభివృద్ధికి 11,475 కోట్లు కోటాయించడం ముఖ్యమంత్రి దార్శనికతకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ మొత్తం ఆదాయంలో 65 శాతం హైదరాబాదు నుంచి లభిస్తున్న నేపథ్యంలో జంట నగరాల అభివృద్ధికి బడ్జెట్లో పెద్దపీట వేయడం రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్వే విస్తరణ, మూసి రివర్ ఫ్రంట్ అభివృద్ధి, సహా ఇతర కార్యక్రమాలకు 10,000 కోట్లు కేటాయించడం దీని వెనక మంత్రివర్గ సహచరుల దూరదృష్టి ఉండడం అభినందనీయమని అన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి అనవసర పథకాలపై దుబారా చేసిందని ఫలితంగా ఒకప్పుడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు అప్పుల ఊబిలో కూరుకొని పోయిందని అన్నారు. బ్రాహ్మణ సంక్షేమానికి 50 కోట్లు ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# పుస్తెలు తాకట్టు పెట్టి పిల్లలు పస్తులు ఉండకుండా చూస్తున్నాం

**మధ్యాహ్న భోజన కార్మికులు**

**విశ్వంభర, కోరుట్ల :** భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం కోరుట్లలో మధ్యాహ్న భోజన కార్మికులు వారి సమస్యల గురించి సమావేశమయ్యారు. 22 సంవత్సరాల క్రితం మధ్యాహ్న భోజన పథకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అప్పటినుండి నిర్విరామంగా మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతుంది కానీ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ప్రభుత్వాలు మారిన నెరవేరడం లేదని కోరుట్ల మండల అధ్యక్షురాలు కే భాగ్య అన్నారు. నేడు కోడుగుడ్డు ధర 7 రూపాయలు ఉంటే ప్రభుత్వం మాత్రం ఐదు రూపాయలు చెల్లిస్తుందని, వారంలో మూడు రోజులు కోడిగుడ్లు ఉండాలని ప్రభుత్వ అధికారులు సూచించారని తెలిపారు. మూడు వేల ఉపకార వేతనం మాత్రమే ప్రభుత్వం ఇస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పదివేల రూపాయల వరకు ఉపకార వేతనం పెంచుతామని చెప్పి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలలు అయినా కూడా ఇంత వరకు ఎట్లాంటి ప్రకటన చేయలేదని అన్నారు. వచ్చే మూడు వేల రూపాయల వేతనం రెండు సార్లు చెల్లిస్తున్నారని, డిసెంబర్ నెల నుండి ఇంతవరకు ఎలాంటి బిల్లులు మంజూరు కాలేవని వాపోయారు. ప్రభుత్వం ప్రతినెల జీతాలను, బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్న మెట్పల్లి గ్రామానికి చెందిన పద్మ మాట్లాడుతూ పుస్తెలతాడులు తాకట్టు పెట్టి అందిన కాడ అప్పులు చేసి పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్నామని 22 సంవత్సరాల నుండి స్కూలు పిల్లలను సొంత పిల్లగా చూస్తూ ఆహారాన్ని ఇస్తున్నామని ప్రభుత్వం దయ తలచి జీతాలు పెంచి బిల్లులు సకాలంలో అందేటట్టు చేయాలని కోరారు. జోహేరా బేగం మాట్లాడుతూ వ్యవసాయ కూలీకి సైతం ప్రతిరోజు 300 నుండి 500 వరకు కూలి వస్తుందని మాకు ప్రతిరోజు 100 రూపాయలు మాత్రమే పడుతుందని ప్రభుత్వం ఈ అసెంబ్లీ బడ్జెట్లో మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు పెరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. కార్మిక నాయకుడు సుతారి రాములు అధ్యక్షతన జగిత్యాల డీఇఓ, ఎంఈఓలకు వినతి పత్రాలు అందజేయడానికి వచ్చామని అన్నారు. కార్యక్రమంలో పద్మ భాగ్య జమున కట్ల పుష్ప పల్లికొండ హరికా, దేవక్క, మరాఠీ సునీత, చంద్రకళ, సల్మా, సబియా బేగం, రహీం, ఉన్నిసా జోహేరా బేగం పాల్గొన్నారు.

# మల్ రెడ్డి రాంరెడ్డి చొరవతో మా కష్టాలు తీరాయి..



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రోడ్ డెవలప్ మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి చొరవతో గడ్డి అన్నారం ట్రేడ్ అసోసియేషన్ కష్టాలు తీరాయని అసోసియేషన్ సభ్యులన్నారు. దిల్ సుఖ్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద భారీకేడ్లు చేయడం వల్ల ట్రేడ్ అసోసియేషన్కు నష్టం జరిగిందన్నారు. తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయని గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తెలంగాణ రోడ్ డెవలప్ మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశామని వెంటనే ముఖ్యమంత్రి తమ సమస్యను పరిష్కరించారని అన్నారు. అందులో భాగంగా ఆదివారం భారీకేడ్లు తొలగించారన్నారు. మల్ రెడ్డి చొరవతో మాకు రోడ్డు మార్గం ఏర్పడినందుకు ఆ రోడ్డుకు మల్ రెడ్డి రాంరెడ్డి పేరుపెట్టనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

# విద్యారంగాని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**విశ్వంభర, కామారెడ్డి :** విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేయడమే అని భారతీయ విద్యార్థి మోర్చ (బీవీఎం) రాష్ట్ర కార్య దర్శి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటు అన్నారు. స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ గత నాలుగు సంవత్సరాల నుండి 8,000 కోట్ల పైగా పెండింగ్ లో ఉన్నాయి, వాటిని విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుంది అని అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇలా తక్కువ నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరం చేసి కుట్ర పన్నుతున్నారాని అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల చాలామంది విద్యార్థులకు స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ రాకపోవడం వల్ల చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడ్డది అన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం 7.30 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులలు, కళాశాల నుంచి యూనివర్సిటీ దాకా సమస్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. గురుకులలు కిరాయి భవనాల లో నడిపిస్తూ విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి మాట తప్పడం సరికాదన్నారు. వెంటనే బడ్జెట్ సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని అలాగే జాబ్ క్యాలెండర్ కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా నాయకులు యోగేష్ సాయి తేజ పట్టణ నాయకులు చరణ్ శ్రావణ్ పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సౌకర్యాలు

# అందించడం మా బాధ్యత

- బాధ్యతలు స్వీకరించిన టీటీడీ అదనపు ఈవో చౌదరి
- డ్యూటీ తొలిరోజే తనిఖీలు
- ఆలయ పరిసరాల పరిశీలన



**విశ్వంభర, తిరుమల :** కలియుగదైవం శ్రీవెంకటేశ్వరస్వామి కొలువు తీరిన తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించడం మా బాధ్యత అని టీటీడీ అదనపు ఈవో సీఎహెచ్, వెంకయ్య చౌదరి అన్నారు. శనివారం సీహెచ్ వెంకయ్య చౌదరి బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆయన డ్యూటీ మొదలుపెట్టారు. తిరుమలలోని పలు క్యూ లైన్లను, నారాయణగిరి షెడ్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్మెంట్లను శనివారం సాయంత్రం టీటీడీ ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణగిరి ఉద్యానవనాల్లోని భక్తులు వేచి ఉండే షెడ్లు, క్యూలైన్లు, లగేజీ, మొబైల్ డిపాజిట్ కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలను టీటీడీ ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్లోని స్కానింగ్ సెంటర్, భక్తులకు అందుతున్న అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, పారిశుద్ధ్యం, తదితర సౌకర్యాలను టీటీడీ ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. కంపార్ట్మెంటులో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం కంపార్ట్మెంట్ లలో శ్రీవారి సేవకులు భక్తులకు అందిస్తున్న పాలను టీటీడీ ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసి భక్తులకు వారందిస్తున్న సేవలను టీటీడీ ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ప్రశంసించారు. అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1, తిరుమల నంబి ఆలయంతో పాటు ఆ ఆలయ పరిసరాలను పరిశీలించి దర్శనం క్యూ లైన్లను సంబంధిత అధికారులను టీటీడీ ఆదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అడిగి తెలుసుకున్నారు. శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు: తిరుమల తరహాలో తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని జేఈఓ కార్యాలయంలో శనివారం శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలపై అధికారులతో వీరబ్రహ్మం సమీక్ష నిర్వహించారు.




# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాభిమాని

**స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్ :** క్రీడాకారుడు, క్రీడాభిమాని ముఖ్యమంత్రి కావడం తెలంగాణ రాష్ట్రములో క్రీడలకు శుభ పరిణామమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి అన్నారు. జింఖానా గ్రౌండ్ లో జరిగిన మాస్టర్ ఫుట్ బాల్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్రీడల పట్ల ప్రత్యేక అభిమానం ఉందని, ఫుట్ బాల్ గేమ్ ఆయనకి ఎంతో ఇష్టమని అందుకే క్రీడాకారుల సంక్షేమం కొరకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించారని అన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, క్రీడల్లో పాల్గొనేవారు ఎంత వయసులో ఉన్నా సరే ఉత్సాహంగా ఉండడానికి దోహదం చేస్తుందని అన్నారు. మాస్టర్ ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించి సీనియర్ క్రీడాకారులందరినీ ఒకచోట చేర్చి పోటీల్లో నిర్వహించడం భావి క్రీడాకారులకు ఎంతో ఉత్సాహం కలిగ చేస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని క్రీడాంశాల్లో, అన్ని విభాగాల్లో నిరంతరం క్రీడా పోటీలు నిర్వహించే విధంగా క్రీడా సంఘాలు ముందుకు రావాలని ఆయన కోరారు. వివిధ క్రీడా సంఘాలు నిర్వహించే పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ తరపున సంపూర్ణ సహకారం అందజేస్తామని ఆయన ప్రకటించారు. కేవలం హైదరాబాద్ నగరానికి పరిమితం కాకుండా వివిధ జిల్లా కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో కూడా రాష్ట్రస్థాయి పోటీ నిర్వహించేందుకు క్రీడా సంఘాలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై. రామారావు, ఉపాధ్యక్షుడు శర్మ, రెడ్డి కాలేజీ మాజీ అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, సుమలత పాల్గొన్నారు.

## నేడు పాతబస్తీ బోనాలకు

# బండి సంజయ్ రాక

- భాగ్యలక్ష్మీ అమ్మవారితో పాటు పలు దేవాలయాల సందర్శన

**విశ్వంభర, హైదరాబాద్ :** బోనాల పండుగను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోనున్నారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడతారు. అక్కడి నుండి బేలా లోని బంగారు మైసమ్మ, హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయం, లాల్ దర్వాజ ముత్యాలమ్మ, గౌలీపురాలోని భారతమాత, ఉప్పుగూడలోని మహంకాళి, అలియాబాద్ లోని దర్బార్ మైసమ్మ, మేకలబండలోని నల్లపోచమ్మ, దూద్ బౌలిలోని కాలభైరవి, కార్వాన్ లోని దర్బార్ మైసమ్మ ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహిస్తారు.



# మహిళా శక్తి పథకాలపై అవగాహన సదస్సు

**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి మున్సిపల్ సమావేశంలో శుక్రవారం మెప్మా రిసోర్స్ పర్సన్స్, మహిళా సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకాలపై మహిళా సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ మోహన్, మెప్మ ఏఓ శ్రీనివాస్ గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ సోమిడి శివ, శానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, సీఓ జ్యోతి పాల్గొన్నారు. కమిషనర్ మోహన్ మాట్లాడుతూ మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఆర్పీ లు మహిళా మండలి సభ్యులకు మహిళా శక్తి పథకాలను వివరించాలని, అలాగే మహిళా అభిరుచి చేయూత అందించాలని, మహిళ క్యాంటీన్ శ్రీనిధి లింకేజీ బ్యాంకు లింకేజీ ద్వారా రెండు కోట్ల 20 లక్షల రూపాయలు రుణాలు మున్సిపాలిటీకి నిధులు కేటాయించారని దీనిని సద్వినియోగం చేసుకునేందుకు మహిళా గ్రూపులు ముందుకు రావాలని అన్నారు. మహిళా సంఘ సభ్యులు రెండు లక్షల బీమా సౌకర్యం, శ్రీనిధి ద్వారా ప్రమాదవశత్తు 10 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాలు సౌకర్యాలు ఉన్నాయని దీని ద్వారా లబ్ధి పొందేందుకు అదేవిధంగా ఫుడ్ క్యాంటీన్సు మకట్కులు ప్యాలాలు తయారు చేసే చిన్న పరిశ్రమలు ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ చేసి స్కూల్ డ్రెస్సులు అంగడి వాడి పిల్లలకు ఇచ్చే డ్రస్సులు ప్రభుత్వ ద్వారా మహిళా సంఘాల ద్వారా ఇప్పించడం ప్రభుత్వ హాస్పిటల్లో ఫుడ్డు క్యాంటీన్ వంటి సౌకర్యాలు ఉన్నాయని దీనిని మహిళా సంఘాల వారు ముందుకు వచ్చేలా వారికి అవగాహన చేయాలని చిన్న పరిశ్రమ మహిళలు ముందుకు వచ్చేలా రుణాలు ఇప్పించి మహిళలకు మహిళా సంఘాల వారికి లబ్ధి చేకూర్చాలని అన్నారు.



# మంత్రి దామోదరకి కృతజ్ఞతలు

**విశ్వంభర, ఆర్మూర్ :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రజల ఆరోగ్యరీత్యా వైద్యులను కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ మంత్రి కార్యలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్ లో ఉన్న ఆర్మూర్ 100 పడకల ఆసుపత్రిని అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని మంత్రిని కోరారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉన్నందున ఆ ఖాళీలను భర్తీ చేయాలని వినతి పత్రాన్ని మంత్రికి ఆయన అందజేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్పందిస్తూ ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులను నియమిస్తూ ఆరోగ్య శాఖ నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఇది వరకు కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ అమృత రామ్ రెడ్డిని తిరిగి ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. మంత్రి వైద్యులనే కాక ఆసుపత్రికి సంబంధించిన 22 మంది స్టాఫ్ నర్సలని, ఒక సీనియర్ అసిస్టెట్లను కూడా కేటాయించినందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి వినయ్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


## పూర్తి కావస్తున్నా

# చెక్ డ్యామ్ నిర్మాణ పనులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం), మోటాకొండూర్ మండలాల్లో బిక్కేరు వాగుపై చెక్ డ్యామ్ ల నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషితో మంజూరు చేయించిన ఆత్మకూరు(ఎం) మండలంలోని కోరటికల్ వద్ద చెక్ డ్యామ్ కి 4.6 కోట్లు, ఉప్పల పహాడు వద్ద చెక్ డ్యామ్ కి 4 కోట్లు రూపాయలు, మోటాకొండూర్ మండలంలోని సికిందర్ నగర్ వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి 3.6 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్-ఆత్మకూరు(ఎం)గ్రామాల మధ్యలో నుండి ప్రవహించే బిక్కేరు వాగుపై 4.6 కోట్ల రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మాణం పూర్తి కావస్తున్నది. ఈ చెక్ డ్యామ్ పూర్తైతే 750 మీటర్ల దూరం వరకు నీరు నిల్వ ఉంటుంది. ఈ చెక్ డ్యామ్ నిర్మాణంతో నిల్వ ఉన్న నీటి వలన చుట్టుపక్కల ఉన్న భూముల లోకి నీరు చేరి భూగర్భజలాలు పెరుగుతాయి.



## ఐక్యరాజ్యసమితిలో
# రామకథా పారాయణం




**విశ్వంభర, న్యూయార్క్ :** ప్రముఖ కవి, తులసీ దాస్ రచించిన రామచరిత మానస్ను ఆధ్యాత్మిక వేత్త మొరారి బాపు న్యూయార్క్లోని ఐక్యరాజ్యసమితిలో తొలిసారి పారాయణం చేయనున్నారు. ఐరాసలోని ప్రతినిధుల డైనింగ్లో తొమ్మిది రోజుల పాటు ఈ పారయణం జరగనుందని మొరారి బాపు మీడియాకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిని పరిరక్షించడంతో పాటు మానసిక ఆరోగ్యం, స్థిరమైన అభివృద్ధి వంటి సమకాలిన సమస్యల పరిష్కారానికి రామ కథలు మార్గం చూపుతాయన్నారు. రామాయణ సందేశాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రపంచంలో సోదర భావాన్ని పెంపొందించి సరిహద్దులకు అతీతంగా ప్రజలను ఏకం చేయడమే లక్ష్యమన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ కి చెందిన మొరారి బాపు ఆధ్యాత్మికవేత్త. ఆయన గత 60ఏళ్లుగా శ్రీలంర, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, కెన్యా, యునైటెడ్ ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, జపాన్ లతో సహా ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలు, పుణ్యక్షేత్రాల్లో రామకథలు పారాయణం చేస్తున్నారు.

# మమత మైక్ కట్ చేయడం అబద్ధం

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**విశ్వంభర, ఢిల్లీ:** ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో తన మైక్ ఆఫ్ చేశారని బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. మమత చేసిన ఆరోపణలు తప్పుదోవ పట్టించేవని తెలిపింది. మమతా బెనర్జీ మాట్లాడేందుకు తగిన మాట్లాడే అవకాశం ఇచ్చారని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్లో తెలిపింది. 'అక్షర క్రమంలో వెళ్తే మమతా బెనర్జీకి మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రమే మాట్లాడే అవకాశం దక్కేది. అయితే సీఎం నుంచి అధికారిక అభ్యర్థన మేరకు ఆమెకు ఏడో స్పీకర్గా మాట్లాడే అవకాశం ఇచ్చారు' అని పేర్కొంది.

### 'ఆ ఆరోపణలు పూర్తిగా అబద్ధం'

అలాగే నీతి ఆయోగ్ మీటింగ్లో మైక్ ఆఫ్ చేశారని మమత చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సమావేశానికి హాజరైన ప్రతి ముఖ్యమంత్రికి మాట్లాడటానికి తగిన సమయం కేటాయించామని వెల్లడించారు. "నీతి ఆయోగ్ సమావేశానికి బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరయ్యారు. సమావేశంలో ఉన్నవారంతా ఆమె మాటలను విన్నాం. సమావేశానికి హాజరైన ప్రతి సీఎంకు నిర్ణీత సమయం కేటాయించాం. ప్రతి టేబుల్ ముందు ఉన్న స్క్రీన్పై వారికి కేటాయించిన టైమ్ ఉంది. తన మైక్ను ఆఫ్ చేశారని మీడియాతో మమత అన్నారు. అది పూర్తిగా అబద్ధం. మమతా బెనర్జీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం." అని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రముఖ వార్తాసంస్థ ఏఎన్ఐతో తెలిపారు.

### దీదీ ప్రీప్లాన్ వాకౌట్ : బీజేపీ

నీతి ఆయోగ్ సమావేశం నుంచి మమతా బెనర్జీ వాకౌట్ ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగిందని బీజేపీ ఆరోపించింది. హెడ్ లైన్స్లో నిలవడం కోసమే మమత ఇలా చేశారని విమర్శించింది. 'దేశంలో హెడ్ లైన్స్లో నిలవడం చాలా సులభం. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరవుతున్న ప్రతిపక్ష ముఖ్యమంత్రిని తానే అని దీదీ చెప్తారు. మళ్లీ అదే సమావేశం నుంచి వాకౌట్ చేసి మైక్ ఆఫ్ చేశారు అందుకు మీటింగ్ను బహిష్కరిస్తున్నా అని చెప్తారు' అని బీజేపీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఆరోపించారు.

# అమర్నాథ్ యాత్రకు ఐఎస్ఐ కుట్ర!



**విశ్వంభర, జమ్మూ:** పవిత్ర అమర్నాథ్ యాత్రకు ఉగ్ర ముప్పు పొంచి ఉందా. అంటే అవుననే అంటున్నాయి నిఘా వర్గాలు. పవిత్ర యాత్రలో విధ్వంసం సృష్టించేందుకు పాకిస్థాన్ కు చెందిన ఐఎస్ఐ కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలకు శుక్రవారం సమాచారం అందింది. ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థ బబ్బర్ ఖల్సా సహకారంతో ఐఎస్ఐ ఈ కుట్రకు తెరతీసినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. తీర్థయాత్ర సమయంలో సామాన్య పౌరులే టార్గెట్గా ఉగ్రదాడికి ప్లాన్ వేసినట్లు దర్యాప్తులో తేలింది. పంజాబ్, దేశ రాజధాని ఢిల్లీలోని బీజేపీ నాయకులు, హిందువులను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించేందుకు ఐఎస్ఐ ప్రణాళిక రచించినట్లు సదరు వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. పంజాబ్ గ్యాంగ్స్టర్లు, రాడికల్ గ్రూపులు ఈ దాడి కోసం ఉగ్రవాద సంస్థలతో చేతులు కలిపినట్లు అధికారులు చెబుతున్నారు.

### కశ్మీర్లోకి చొరబడ్డ ఉగ్రవాదులు?

దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించడానికి పాకిస్థాన్ నుంచి ఏడుగురు ఉగ్రవాదులు కశ్మీర్లోని ప్రవేశించారని ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ క్రమంలోనే పఠాన్కోట్ సమీపంలోని ఓ గ్రామంలో అధునాతన ఆయుధాలతో అనుమానిత ఉగ్రవాదుల కదలికలను గుర్తించాయి. జమ్మూ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా భద్రతా బలగాలపై జరుగుతున్న దాడుల వెనుక పాకిస్థాన్ కుట్ర ఉన్నట్లు సైనికులు అనుమానిస్తున్నారు. అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఉగ్ర కుట్రల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తమైన భారత బలగాలు అమర్నాథ్ యాత్రకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. జమ్మూ కశ్మీర్లోని అనంత్నాగ్ జిల్లాలో అమర్నాథ్ గుహల్లో సహజసిద్ధంగా ఏర్పడే మంచు లింగాన్ని దర్శించుకునేందుకు ఏటా దేశ నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఈ ఏడాది జూన్ 29న యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ 4 లక్షలకుపైగా భక్తులు దేశ విదేశాల నుంచి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

## అగ్నివీరులకు రిజర్వేషన్లు
# ప్రకటించిన 6 రాష్ట్రాలు



**విశ్వంభర, నెట్వర్క్ :** కార్గిల్ దివస్ సందర్భంగా అగ్నివీర్లుగా త్రివిధ దళాల్లో సేవలు అందించిన వారికి రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ రాష్ట్రాలు ప్రకటించాయి. వివాదాస్పద అగ్నిపథ్ పథకం కింద సైనికులను స్వల్పకాలికంగా చేర్చడంపై ఆగ్రహాన్ని చల్లార్చడానికి, వారిని రెగ్యులర్ సర్వీసులో కొనసాగించకపోతే వారికి రక్షణ కవచం కల్పించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్రాలు ఈ రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లోని పోలీసు, ఇతర సెక్యూరిటీ సర్వీసుల్లో ఈ రిజర్వేషన్లను ప్రకటించాయి.

### అగ్ని వీర్ పథకం

కేంద్రం 2022 జూన్ లో అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించింది. ఇది 17.5 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులను నాలుగు సంవత్సరాల కాలానికి సాయుధ దళాల్లో నియమించడానికి వీలు కల్పించింది. అయితే, వీరిలో 25% మందిని మాత్రమే సాయుధ దళంలో శాశ్వతంగా కొనసాగిస్తారు. మిగతా, 75% మంది నాలుగేళ్ల తరువాత రిటైర్ కావాల్సి ఉంటుంది. వారికి ఇతర ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో రాష్ట్రాలు తమ పరిధిలోని ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ పై భారత్ విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆరు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రకటన చేశాయి. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న హర్యానాలో ప్రభుత్వం జూలై 17న కొన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అగ్ని వీరులకు 10 శాతం రిజర్వేషన్లు, ఇతర సర్వీసుల అర్హతలో వయోపరిమితి సడలింపును ప్రకటించింది. రాష్ట్రంలో పోలీసు కానిస్టేబుళ్లు, ఫారెస్ట్, జైల్ గార్డులను రిక్రూట్ చేసేటప్పుడు రాష్ట్రానికి చెందిన అగ్నివీరులకు ప్రాధాన్యత ఇస్తామని ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి చెప్పారు. అగ్నివీరులకు నిర్ణీత రిజర్వేషన్ కోటా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తుందని, ఈ నియామకాల్లో వారికి ప్రాధాన్యం లభించేలా చూస్తామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం అగ్నివీరులకు పోలీసు, భద్రతా దళాల్లో రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ చెప్పారు. షార్ట్ సర్వీస్ సైనికులకు రాష్ట్ర పోలీసు శాఖలో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ మాఝీ తెలిపారు. హర్యానా మాదిరిగానే ఒడిశా కూడా ఇతర సర్వీసులకు అర్హతలో వయోపరిమితి సడలింపును ప్రకటించింది. రాష్ట్రంలోని యూనిఫాం బలగాల్లో పది శాతం పోస్టులను అగ్నివీర్లకు రిజర్వు చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం తలెత్తిన పరిస్థితుల్లో తరచూ సైన్యాన్ని మోహరించకుండా నిరోధించడానికి 1948 లో ఏర్పాటు చేసిన రాష్ట్ర పోలీసు, ప్రావిన్షియల్ ఆర్మ్డ్ కాన్స్టాబులరీలో అగ్నివీరులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. స్వల్పకాలిక నియామక పథకం కింద చేరిన సైనికులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి హామీ ఇచ్చారు.



## కేంద్ర హెం మంత్రి అమిత్ షాపై శరద్ పవార్ ఘాటు వ్యాఖ్యలు

**విశ్వంభర, ఢిల్లీ:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్, కేంద్ర హెూంమంత్రి అమిత్ షాపై విరుచుకుపడ్డారు. అత్యంత అవినీతి పరుడు శరద్ పవార్ అని అమిత్ షా చేసిన కామెంట్లపై ఆయన నిప్పులు చెరిగారు. గతంలో ఓ కేసుకు సంబంధించిన అమిత్ షాను సుప్రీం కోర్టు రెండేళ్లు బహిష్కరించిందని చురకలు అంటించారు. కొన్నిరోజుల క్రితం అమిత్ షా నాపై ఆరోపణలు చేశారు. దేశంలోని అవినీతిపరులందరికీ శరద్ పవార్ ఒక కమాండర్ అని పేర్కొన్నారు. అయితే.. చట్టాన్ని దుర్వినియోగం చేశారంటూ ఓ కేసులో సుప్రీంకోర్టు ఆయనని రెండేళ్ల పాటు గుజరాత్ నుంచి బహిష్కరించింది. అలాంటి వ్యక్తి దేశహెూంమంత్రిగా ఉండటం విచిత్రంగా ఉంది. దేశం ఎలాంటివారి చేతిలో ఉందో మనమంతా ఆలోచించుకోవాలి. ఇలాంటి వారు దేశాన్ని వందశాతం తప్పుడు మార్గంలో నడిపిస్తారు.' అంటూ శరద్ పవార్ తీవ్ర ఆరోపణలు చేశారు.



## లైంగిక దాడి కేసులో కర్ణాటక మాజీ సీఎంకు రిలీఫ్

**విశ్వంభర, కర్ణాటక :** మైనర్పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్. యడ్యూరప్పను అరెస్ట్ చేయరాదంటూ సీఐడీ అధికారులకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసిన కర్ణాటక హైకోర్టు ఆ ఆదేశాలను మరో ఒక వారం పాటు పొడిగించింది. హైకోర్టు ఆదేశాలతో బీఎస్. యడియూరప్ప తాత్కాలికంగా ఊపిరిపీల్చుకున్నారు. ఈ కేసులో తన మీద నమోదు చేసిన ఎఫ్ఐఆర్ను రద్దు చేసి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మాజీ సీఎం యాడియూరప్ప దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను హైకోర్టు న్యాయమూర్తి శుక్రవారం జస్టిస్ కృష్ణ ఎస్. దీక్షిత్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. సోమవారం నుంచి మరో బెంచ్ (రోస్టర్ మార్పు) ముందు ఈ పిటిషన్లు విచారణకు రానున్నందున బెంచ్ విచారణను వారం రోజులపాటు వాయిదా వేసింది. అప్పటి వరకు మాజీ సీఎం యడ్యూరప్పను అరెస్టు చేయవద్దని సీఐడీకు కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. మాజీ సీఎం యడ్యూరప్ప వ్యక్తిగత సహాయకుడు కోర్టుకు హాజరుకాకుండా మినహాయింపు ఇస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కోర్టు పొడిగించింది. మైనర్ పై లైంగిక వేధింపుల ఆరోపణపై బెంగళూరు సిటీలోని సదాశివనగర్ పోలీస్ స్టేషన్లో ఇదే ఏడాది మార్చి 14వ తేదీన మాజీ సీఎం బీఎస్. యడ్యూరప్పపై పోక్సో (లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ) చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. దీంతో కర్ణాటక ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును సీఐడీకి చెందిన సిట్కి బదిలీ చేసింది. ప్రత్యేక పోక్సో కోర్టు సమన్లుజారీ చేసిన తర్వాత మాజీ సీఎం బీఎస్. యడ్యూరప్ప ముందస్తు బెయిల్ను కోరుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు ముందు కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప మీద కేసు నమోదు అయ్యింది. అయితే రాజకీయ కక్షలతో మాజీ సీఎం యడియూరప్ప మీద కేసు నమోదు అయ్యిందని కొందరు ఆరోపించారు.

## ముంబైలో కుప్పకూలిన
# మూడంతస్తుల భవనం



**విశ్వంభర, ముంబై:** నవీ ముంబైలో విషాదం చోటు చేసుకుంది. షాబాజ్ ప్రాంతంలో మూడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ భవనం శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే.. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటన స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. శనివారం తెల్లవారు జామున 5గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుందని నవీ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కైలాస్ షిండే తెలిపారు. కుప్పకూలిన భవనం జీప్లస్3 భవనం. ఇందులో 13ప్లాట్లు ఉన్నాయి. భవనం శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కూలిన భవనం 10ఏళ్ల నాటి భవనమని, ఈ ఘటనపై విచారణ జరుగుతుందని కమిషనర్ తెలిపారు. భవన యాజమానిపైనా చర్యలు తీసుకోవటం జరుగుతుందని అన్నారు. ఇదిలాఉంటే.. గత వారం రోజుల నుంచి ముంబైలో భారీ వర్షాలు కురు-స్తున్నాయి. అయితే, ఈ భవనం కూలిపోవడానికి కారణాలు ఏమిటనే విషయంపై అధికారులు దృష్టిసారించారు.

# అసోం సమాధులకు యునెస్కో గుర్తింపు



**విశ్వంభర, అసోం:** అస్సాంలో అహెూమ్ రాజవం శీకులు నిర్మించిన సమాధులను శుక్రవారం యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చేర్చిం ది. ఈశాన్య భారతం నుంచి ఈ జాబితాలో చేరిన మొట్టమొదటి వారసత్వ సంపదగా ఈ సమాధులు రికార్డులకెక్కాయి. భారత్లో జరుగుతున్న యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సమావేశాలలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అస్సాంలోని పిరమిడ్ల వంటి మట్టి సమాధులను మోయిదమ్ అంటారు. 600 ఏళ్లపాటు అస్సాంను పాలించిన టాయ్-అహెూం రాజవంశం తమ పూర్వీకులను చరాయ్ దేవ్లో మట్టితో పిరమిడ్ ఆకృతిలో నిర్మించిన దిబ్బలలో సమాధి చేసేది. ఈ సమాధి దిబ్బలపై పచ్చగడ్డి పెరిగి హరిత కవర్ణం సంతరించుకుంది. వారసత్వ కట్టడం హెూదా కోసం మోయిదమ్లు నామినేషన్ పత్రం దశాబ్దం క్రితం పంపించారు. యునెస్కో గుర్తింపు రావడంపై సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ ఇవాళ సువర్ణాక్షరాలతో లిఖితమవుతుందని అన్నా రు. యునెస్కోకు కృతజ్ఞతలు తెలుపుతూ.. మోయి డమ్స్ ప్రాధాన్యతను అర్థం చేసుకున్నందుకు యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. సీఎం హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ "మొయిదమ్లు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో సాంస్కృతిక ఆస్తి. యునెస్కో గుర్తింపు రావడం అసోం సాధించిన గొప్ప విజయం. ఈశాన్య భారత దేశం నుంచి ఈ గుర్తింపు పొందడం తొలిసారి. కజిరంగా, మనస్ నేషనల్ పార్కుల తర్వాత, ఇది అస్సాం మూడవ ప్రపంచ వారసత్వ సంపాదగా నిలిచింది" అని హిమంత అన్నారు.

## ఢిల్లీలో కేంద్ర మంత్రితో
# సీఎం చంద్రబాబు కీలక భేటీ



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టుపై జల శక్తి మంత్రితో చర్చించారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టుకు సహకరిస్తామని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన విషయం తెలిసిందే. పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా సహకరిస్తామని కేంద్రం ప్రకటించినందుకు ఇటీవల ఏపీ క్యాబినెట్ కూడా కృతజ్ఞతలు తెలిపింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పూర్తిస్థాయి మొత్తం ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను చంద్రబాబు నాయుడు కోరినట్లు తెలుస్తోంది. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అంగీకరించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి అవసరమైన 12 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ ఇన్వెస్ట్మెంట్ బోర్డ్ అంగీకరించింది. పోలవరం మొదటి దశ నిర్మాణానికి అవసరమయ్యే 12 వేల కోట్ల రూపాయల ఖర్చుతో పాటు మొత్తం 50 వేల కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన ప్రతిపాదనలకు ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఏపీలోని గత వైసీపీ ప్రభుత్వం పాలనలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జాప్యం జరిగిందని, వచ్చే మూడేళ్లలో తొలిదశ నిర్మాణం పూర్తి చేస్తామని ఇటీవలే పార్లమెంట్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తెలిపింది. పోలవరం ప్రాజెక్టు మొదటి దశ మార్చి 2026 నాటికి పూర్తవుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.



## మీకెందుకు సంఘీభావం ప్రకటించాలి..?

**జగన్‌కు షర్మిల సూటి ప్రశ్న**

**విశ్వంభర, అమరావతి :** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశిస్తూ సంచలన ట్వీట్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయని, వైసీపీ కార్యకర్తలపై దాడులు పెరిగాయని పేర్కొంటూ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీలో ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ధర్నాకు ఇండియా కూటమిలోని పలు పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలపకపోవడంపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ వ్యాఖ్యలకు ట్విటర్ వేదికగా షర్మిల కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో వైసీపీ చేపట్టిన ధర్నాకు కాంగ్రెస్ పార్టీ ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలంటున్న వైఎస్ జగన్ ప్రశ్నించడాన్ని షర్మిల తీవ్రంగా తప్పుబట్టారు. మీ ధర్నాకు సంఘీభావం ఎందుకు ప్రకటించాలి? అంటూ ప్రశ్నించారు. పార్టీ ఉనికికోసం ఢిల్లీలో కపట నాటకం ఆడినందుకా..? వ్యక్తిగత హత్యకు రాజకీయ రంగు పులిమినందుకా..? 5ఏళ్లు బీజేపీతో అక్రమ సంబంధం పెట్టుకుని, విభజన హక్కులను, ప్రత్యేక హోదాను బీజేపీకి తాకట్టు పెట్టినందుకా? అంటూ జగన్మోహన్ రెడ్డిని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఆఖరికి మణిపూర్ ఘటనపై నోరెత్తని మీకు.. ఉన్నట్లుండి అక్కడి పరిస్థితులు గుర్తుకు రావడం విడ్డూరం. క్రిష్టియన్ అయిఉండి క్రైస్తవులను ఊచకోత గురి చేసినా నోరు మెదపకుండా విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానంలో బీజేపీ కే మద్దతు ఇచ్చింది మీరు కాదా అంటూ ప్రశ్నించారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో
# మంత్రుల పర్యటన



**విశ్వంభర, అమరావతి :** పోలవరం విలీన మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రుల బృందం పర్యటించింది. వైఎస్సార్సీపీ హయాంలో నిర్వాసితులను గాలికి వదిలేశారని మంత్రులు విమర్శించారు. గోదావరి వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులను పరామర్శించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రుల బృందం పోలవరం విలీన మండలాల్లో పర్యటించింది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, హోం మంత్రి వంగలపూడి అనితతో కూడిన మంత్రుల బృందం ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించింది. పెద్ద వాగు సమస్య కూడా తీరుస్తామని భరోసా కల్పించారు. కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీని సందర్శించిన మంత్రులు అక్కడ నిర్వాసితులకు అందుతున్న ప్రభుత్వ సహాయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం చేస్తున్న సహాయ కార్యక్రమాలను బాధితులు, అధికారులను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పునరావాస కాలనీల్లో ఉన్న సమస్యలను బాధితులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పునరావాస కాలనీల్లో రోడ్లు, మరుగు దొడ్ల సమస్యను నివేదించారు. దీనిపై స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు త్వరగా బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర సమస్యలనూ పరిష్కరిస్తామన్న అచ్చెన్న ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా 3 వేల రూపాయలు ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

# ఆగస్టు 1న పింఛన్ల పంపిణీ



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు నెల పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నాలుగు రోజులు ముందుగానే నిధుల విడుదలపై ఫోకస్ పెట్టింది. గత నెలలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించగా.. ఈసారి కూడా వారే ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అలా చేయని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టంగా తెలియజేశారు. అస్వస్థతతో ఉన్న వారు, ఇంకా పంపిణీ మిగిలితే 2న ఇస్తారు. ఎవరైనా పింఛన్ లబ్ధిదారులు ఇతర ప్రాంతాల్లో ఉంటే ఆగస్టు ఒకటినాటికి స్వగ్రామాల్లో అందుబాటులో ఉండేలా సమాచారం ఇవ్వాలని అధికారులు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మరవైపు ఆగస్టు నెలలో పింఛన్ల పంపిణీకి సంబంధించి సెర్ప్ సీఈవో కొన్ని సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు.. ఆగస్టు 1న ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించాలన్నారు. మొదటి రోజే 99శాతం పింఛన్లు పంపిణీ పూర్తి కావాలని.. ఒకవేళ సాంకేతిక సమస్య ఎదురైతే రెండోరోజు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు.. ఆ తర్వాత పంపిణీ సమయం పొడిగించరని తెలిపారు. అలాగే మొదటి రెండు రోజులు పింఛన్ పంపిణీపై అన్ని గ్రామాల్లో సోషల్ మీడియా, మీడియా, బీట్ ఆఫ్ టామ్ టామ్, బహిరంగ ప్రదేశాల్లో ఆడియో రికార్డింగ్ ప్లే చేయడం, వాట్సాప్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని.. ఈ సమాచారం ప్రతి పింఛన్ లబ్ధిదారుడికి చేరాలని సూచించారు. ఒకవేళ 90 కంటే ఎక్కువ మంది పింఛనుదారులు ఒకే సిబ్బందికి మ్యాప్ చేయబడిన చోట, అటువంటి మ్యాపింగ్ మొత్తం (91 నుంచి 100 పింఛనుదారులు: 86 మంది సిబ్బంది - 100 కంటే ఎక్కువ మంది పెన్షనర్లు: 12 మంది సిబ్బంది) తగ్గించాలని సూచించారు. ఈ రీ మ్యాపింగ్ ప్రక్రియ శనివారం (27-07-2024) నాటికి పూర్తి చేయాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా పింఛన్ డబ్బుల్ని ఇప్పటికే అన్ని ఎంపీడీవోలు, కమీషనర్‌లకు పంపించామన్నారు. ఈ మొత్తాలు 31.07.2024న సచివాయాల బ్యాంక్ ఖాతాలకు జమ చేయబడతాయన్నారు. బ్యాంక్ మేనేజర్‌లకు నగదు ఆవశ్యక లేఖను ముందుగానే అందించమని తెలియజేయాలన్నారు. ఈ నెల 31న నగదు మొత్తాన్ని విత్‌డ్రా చేయాలని సూచించారు.



# 'నీతి ఆయోగ్' సమావేశం

**సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ సమావేశం శనివారం నాడు జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ఏపీకి రావాల్సిన నిధుల కేటాయింపులపై చర్చించారు. అనంతరం కేంద్ర జల శక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ (సీఆర్ పాటిల్)ను కలిశారు. వీరి భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టుకు సహకరిస్తామని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన విషయం తెలిసిందే. పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా సహకరిస్తామని కేంద్రం ప్రకటించినందుకు ఇటీవల ఏపీ క్యాబినెట్ కూడా కృతజ్ఞతలు తెలిపింది.

### ఏపీ తలసరి ఆదాయం పడిపోయింది..

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పూర్తిస్థాయి మొత్తం ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను చంద్రబాబు నాయుడు కోరారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నవే ఇచ్చారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తెలిపారు. అమరావతి పోలవరం వెనుకబ డిన జిల్లాల అభివృద్ధి అన్ని విభజన చట్టంలో ఉన్నాయని చెప్పారు. ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ప్రత్యేక హోదా బదులు క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌కి సహాయం చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. విభజన సమయంలో ఆంధ్ర తెలంగాణకు తలసరి ఆదాయం రూ. 30 వేల తేడా ఉందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విభజన కంటే ఎక్కువ అధ్వాన్నమైన పరిస్థితికి ఏపీ పడిపోయిందని అన్నారు. తలసరి ఆదాయం పడిపోయిందని చెప్పారు.

### పోలవరంపై ప్రతిపాదనలు..

"కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పాలి. విభజన చట్టం ప్రకారం ఏపీకి రావాల్సినవవే వచ్చాయి. రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏదో ఇచ్చారన్నట్టు కొందరు రాజకీయం చేస్తున్నారు. చట్టం రూపకల్పన చేసింది కాంగ్రెస్ పార్టీయే. విభజన కంటే గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ పథకాల్లో గత ఐదేళ్లలో రాష్ట్రం చాలా రాష్ట్రాల కంటే వెనుకబడింది.

ఏ మంత్రిత్వ శాఖ దగ్గరకు వెళ్లిన రాష్ట్రం వెనుకబడిన గణాంకాలే చూపిస్తున్నారు. పోలవరం, అమరావతి విషయంలో కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపాను. పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించడానికి ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచాము. ఏపీ క్యాబినెట్ చేసిన తీర్మానాన్ని అందజేశాను. పోలవరం ప్రాజెక్టు మొదటి దశకు అవసరమైన రూ. 12,500 కోట్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం వెంటనే ఆమోదించేలా చూడాలని కోరాను" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




# ధవళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపం

**రెండో ప్రమాద హెచ్చరిక జారీ**

**విశ్వంభర, ధవళేశ్వరం :** ఏపీలో గోదావరి నది పరీవాహక ప్రాంతాలను వరద ముంపు ఇంకా వీడలేదు. ధవళేశ్వరం వద్ద వరద భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 13.75 అడుగులకు చేరింది. అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 13 లక్షల క్యూసెక్కులుగా ఉంది. కోనసీమ లంక గ్రామాలు ఇప్పటికీ ముంపులోనే ఉండగా... గోదావరి ఉద్ధృతి మళ్లీ పెరగడంతో లంక గ్రామాల వాసులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను హెచ్చరించింది. విద్యుత్ లైన్లు, స్తంభాలకు దూరంగా ఉండాలని, వరద నీటిలోకి దిగొద్దని సూచించింది.



## నిరుద్యోగులకు లోకేశ్ గుడ్ న్యూస్

**విశ్వంభర, అమరావతి :** అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా మంత్రి లోకేశ్ ఏపీ యువతకు గుడ్ న్యూస్ చెప్పారు. అసెంబ్లీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో మెగా డీఎస్సీ హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేష్ తెలిపారు. ఉపాధ్యాయుల నియామక అంశాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందని.. రిక్రూట్ మెంట్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకు మరిన్ని ఇన్సెంటివ్స్ ఇచ్చి ప్రోత్సహిస్తామని అసెంబ్లీలో మంత్రి లోకేష్ తెలిపారు.



## మహిళలను వేధిస్తే ఉపేక్షించొద్దు

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అమరావతిలోని తన కార్యాలయానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. తన శాఖలపై వచ్చిన అర్జీలతో పాటు ఇతర సమస్యల అర్జీలను కూడా పరిశీలించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించడంతో పాటు, సమస్య తీవ్రతను బట్టి అధికారులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లేన్ నుంచి మహిళలు, వృద్ధులు తెలియచేసిన సమస్యపై స్పందించారు. ముఠాలుగా ఏర్పడిన కొందరు యువకులు బైక్స్ పై ప్రమాదకరంగా, వేగంగా వీధుల్లో సంచరిస్తూ విద్యార్థినులు, యువతులను, మహిళలను వేధిస్తున్నారని, వృద్ధులను భయపెడుతున్నారని ఓ లేఖలో పవన్ కు ఫిర్యాదు వచ్చింది. అమ్మాయిల ఫొటోలు తీసి ఇంటర్నెట్లో పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మద్యం తాగి ఇళ్ల ముందు భారీ శబ్దాలు చేస్తూ పాటలుపెట్టడం, ఇళ్లపై రాళ్ళు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పిర్యాదు అందింది. నిందితుల ఫొటోలను, వాహనాల నంబర్లను సైతం తమ ఫిర్యాదుకు జత చేశారు బాధితులు. ఆ యువకులు ఒక మహిళా ఎస్సైను సైతం వేధించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు బాధితులు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుతో ఫోన్ లో మాట్లాడారు పవన్. వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి వచ్చిన సమస్యను తక్షణమే పరిష్కరించాలి ఆదేశించారు.

# శ్రీలంకపై టీమిండియా అద్భుత విజయం


- 43 పరుగుల తేడాతో టీమిండియా విక్టరీ
- 19.2 ఓవర్లలో 170 పరుగులకు శ్రీలంక ఆలౌట్




**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంకతో టీ20 సిరీస్ లో టీమిండియా గెలుపుతో బోణీ కొట్టింది. పల్లెకెలెలో జరిగిన తొలి టీ20 మ్యాచ్ లో టీమిండియా 43 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను ఓడించింది. ఈ మ్యాచ్ లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. 214 పరుగుల భారీ లక్ష్యఛేదనను శ్రీలంక ఆరంభించిన తీరు చూస్తే... ఆ జట్టు గెలుపుపై ఎవరికీ సందేహాలు కలగవు. ఆ జట్టు స్కోరు 8 ఓవర్లకే 80 పరుగులు దాటింది. ఓపెనర్లు పత్తుమ్ నిస్సాంక 79, కుశాల్ మెండిస్ 45 పరుగులతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆ తర్వాత కూడా 14 ఓవర్లలో 140 పరుగులు చేసిన విజయం దిశగా దూసుకుపోతున్నట్టు కనిపించింది. కానీ, టీమిండియా బౌలర్లు కీలక సమయంలో రాణించడంతో శ్రీలంక అక్కడ్నించి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. చివరికి 19.2 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ చరిత్ అసలంక (0), మాజీ కెప్టెన్ దసున్ షనక (0) డకౌట్ కావడంతో లంక విజయావకాశాలను ప్రభావితం చేసింది. కుశాల్ పెరీరా 20, కమిందు మెండిస్ 12 పరుగులు చేశారు. మిగతా అంతా సింగిల్ డిజిట్ కే పరిమితయ్యారు. టీమిండియా బౌలర్లలో పార్ట్ టైమ్ బౌలర్ రియాన్ పరాగ్ 3 వికెట్లు పడగొట్టడం విశేషం. అర్షదీప్ సింగ్ 2, అక్షర్ పటేల్ 2, మహ్మద్ సిరాజ్ 1, రవి బిష్ణోయ్ 1 వికెట్ తీశారు. ఈ విజయంతో టీమిండియా 3 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో 1-0తో ముందంజ వేసింది. ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ రేపు (జులై 28) ఇదే మైదానంలో జరగనుంది. కాగా, టీమిండియా హెడ్ కోచ్ గా గౌతమ్ గంభీర్ కూడా విజయంతో ప్రస్థానం ఆరంభించినట్టయింది.

# పారిస్ ఒలింపిక్స్‌లో పతకం దిశగా భారత్

- షూటింగ్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లిన మను భాకర్
- తొలిరోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు
- సాత్విక్ - చిరాగ్ జోడీ ముందంజ.. రెండో రౌండ్‌కు లక్ష్యసేన్



**విశ్వంభర, పారిస్ :** పారిస్ వేదికగా జరుగుతున్న 2024 ఒలింపిక్స్‌లో షూటర్ మను భాకర్ పతకం దిశగా అడుగు ముందుకేసింది. భారత్ ఎన్నో ఆశలు పెట్టుకున్న షూటింగ్ విభాగంలో షూటర్ మను భాకర్ సత్తా చాటింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఆమె ఫైనల్‌కు దూసుకెళ్లింది. దాంతో పారిస్ ఒలింపిక్స్ 2024 లో ఫైనల్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణి అయ్యారు. మను భాకర్ 580-27% స్కోరుతో క్వాలిఫయింగ్ రౌండ్‌లో 3వ స్థానంలో నిలిచి.. ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. మరోవైపు మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్యాలిఫికేషన్‌లో మరో భారత షూటర్ రిథమ్ సంగ్వాన్ 573 పాయింట్లతో 15వ స్థానానికి పరిమితమయ్యారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్స్ జులై 28 (ఆదివారం) మధ్యాహ్నం 3.30 గంటలకు షురూ అవుతుంది. ఇందులో మను క్వాలిఫికేషన్ రౌండ్‌లో మొదటి స్థానంలో నిలిచిన హంగేరి క్రీడాకారిణి మేజర్ వెరోనికా, రెండో స్థానంలో నిలిచిన హెూ యే జిన్‌ల నుంచి గట్టి పోటీని ఎదుర్కోనుంది.

### సాత్విక్ - చిరాగ్ జోడీ ముందంజ.. రెండో రౌండ్‌కు లక్ష్యసేన్

భారత ఏస్ డబుల్స్ జోడీ విశ్వ క్రీడలను విజయంతో ఆరంభించింది. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం పారిస్ ఒలింపిక్స్‌లో బోణీ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ జంట ల్యాకస్ కోర్వీ, రొనన్ లాబర్‌పై గెలుపొందింది. 47 నిమిషాల పాటు హెూరాహెూరీగా సాగిన పోరులో భారత ద్వయం ప్రత్యర్థికి ఏమాత్రం చాన్స్ ఇవ్వలేదు. తొలి సెట్‌ను 21-17తో గెలుపొందిన సాత్విక్ - చిరాగ్ రెండో సెట్‌లోనూ దూకుడుగా ఆడారు. దాంతో, 21-14తో వెనకబడిన ఫ్రాన్స్ జంటకు ఓటమి తప్పలేదు. ఈ విజయంతో సీత్విక్, చిరాగ్ జంట రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.

### రెండో రౌండ్‌కు లక్ష్యసేన్

పురుషుల సింగిల్స్‌లోనూ భారత షట్లర్ లక్ష్యసేన్ సత్తా చాటాడు. అద్భుత విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. శనివారం జరిగిన మ్యాచ్‌లో కెవిన్ కార్డాన్ పై లక్ష్యసేన్ అలవోకగా గెలుపొందాడు. తొలి సెట్‌ను 21-8తో సొంతం చేసుకున్న భారత షట్లర్‌కు రెండో సెట్‌లో గట్టి పోటీనిచ్చాడు. అయితే.. ఏమాత్రం పట్టువిడవని లక్ష్యసేన్ 22-20తో సెట్‌ను ముగించి కెవిన్‌కు చెక్ పెట్టాడు.

# పివి సింధు డ్రెస్ కోడ్‌పై తీవ్ర దూమారం!

**దేశం పరువుతీసేలా ఉందని నెటిజన్లు ఆగ్రహం**

**మనవారు ధరించిన కుర్తా పైజామా డిజైన్‌పై కూడా విమర్శలు**




**విశ్వంభర, ప్యారిస్:** ఒలింపిక్స్ లాంటి ప్రతిష్టాత్మక క్రీడా పోటీల్లో పతకాలు గెలిచి.. దేశ ప్రతిష్టతను పెంచాలనే లక్ష్యంతో భారత అథ్లెట్ల బృందం ప్యారిస్‌లో అడుగుపెట్టింది. అట్టహాసంగా మొదలైన ప్యారిస్ ఒలింపిక్స్ 2024 ప్రారంభ వేడుకల్లో మన తెలుగమ్మాయి, ఇండియన్ స్టార్ షట్లర్ పీవీ సింధు ఫ్లాగ్ బేరర్‌గా.. భారత జాతీయ జెండాను చేతబట్టి.. భారత అథ్లెట్ల బృందానికి నాయకత్వం వహించింది. ఈ అరుదైన దృశ్యాలను చూసి.. భారతీయులు పులకించిపోయారు. అయితే.. ఒలిపిక్స్ ప్రారంభ వేడుకల్లో పాల్గొనేందుకు ముందు ఇండియన్ అథ్లెట్లకు ఇచ్చిన డ్రెస్ కోడ్ చీరలో ఉన్న ఫొటోలను పీవీ సింధు తన సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పీవీ సింధు ధరించిన చీరపై వివాదం చెలరేగింది. ఇదే డ్రెస్ కోసం.. దేశం పరువుతీసేలా ఉందని, ఇంత కంటే మంచి డ్రెస్‌లు, చీరలు ముంబై వీధుల్లో రూ.100కి, రూ.200లకి కూడా దొరుకుతాయని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒలిపింక్స్ లాంటి ప్రతిష్టాత్మక వేదికపై భారతదేశం పరువుతీసేలా డ్రెస్ కోడ్‌ను డిజైన్ చేశారంటూ చాలా మంది విమర్శలు చేస్తున్నారు. పీవీ సింధు పెట్టిన ఫొటోలపై బెంగళూరుకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ నందితా అయ్యర్ స్పందిస్తూ.. తరుణ తహిలియా నీ.. మీరు డిజైన్ చేసిన ఈ యూనిఫామ్స్ కంటే మంచి చీరలు రూ.200లకు ముంబై వీధుల్లో అమ్ముతారు. చౌకైన పాలిస్టర్ వస్త్రంతో, ఇకత్ ప్రింట్, జాతీయ జెండా రంగులతో డిజైన్ చేసిన డ్రెస్ కోడ్ అధ్వానంగా ఉందంటూ విమర్శించారు. చివరి నిమిషాల్లో హడావిడిగా వీటిని డిజైన్ చేశారా? అంటూ పేర్కొన్నారు. అలాగే ఈ చీర ధరించిన క్రీడాకారిణి గురించి తాను అగౌరవంగా మాట్లాడం లేదని, కేవలం డిజైన్ గురించే చెబుతున్నట్లు నందితా వివరణ ఇచ్చారు. అలాగే మనవారు ధరించిన కుర్తా పైజామా డిజైన్‌పై కూడా విమర్శలు వస్తున్నాయి. మరీ ఇంత దారుణంగా డిజైన్ చేశారేంటి అంటూ నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మన సంస్కృతి సంప్రదాయం ఒట్టి పడేలా మంచి డిజైన్ చేసి ఉండాల్సిందంటూ సూచిస్తున్నారు. కాగా.. భారత అథ్లెట్ల కోసం రూపొందించిన ఈ డ్రెస్ కోడ్‌ను ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ తరుణ తహిలియానీ డిజైన్ చేశారు.



# పారిస్ ఒలింపిక్స్‌కు బీహార్ ఎమ్మెల్యే

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్ కోసం భారత క్రీడాకారులు సర్వ సన్నద్ధమయ్యారు. మొత్తం 117 మంది భారతీయ క్రీడాకారులు ఈ పోటీ కోసం తరలివెళ్లారు. వారిలో బీహార్‌కు చెందిన ఎమ్మెల్యే శ్రేయసి సింగ్ ఒకరు. బీహార్‌లోని జముయ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన శ్రేయసి షూటింగ్ క్రీడాకారిణి. 2014 లో గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో డబుల్ ట్రాప్ విభాగంలో రజత పతకం అందుకుంది. అలాగే 2018లో గోల్డ్‌కోస్ట్‌లో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకాన్ని అందుకుంది. అర్జున అవార్డు గ్రహీత కూడా అయిన శ్రేయసి పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం చేజిక్కించుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. శ్రేయసి ఫరీదాబాద్‌లోని మానవ్‌రచనా యూనివర్సిటీలో ఎంబీఏ చేసిన శ్రేయసి 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జముయ్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. శ్రేయసిది పూర్తిగా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. దీంతో ఆమె అనివార్యంగా రాజకీయాల్లోకి రావాల్సి వచ్చింది. రాజకీయాల్లోకి రావడంతో ఆమె ఎంతో ఇష్టమైన షూటింగ్‌కు తగినంత సమయం కేటాయించలేకపోతోంది. పైగా ఆమె నియోజకవర్గంలో షాట్‌గన్ రేంజ్ అందుబాటులో లేదు. అయినప్పటికీ శ్రేయసి ప్రాక్టీస్ కోసం ఢిల్లీ వెళ్లి వస్తుంటుంది. ఒకపక్క ఎమ్మెల్యేగా, మరోవైపు క్రీడాకారిణిగా శ్రేయసి తన బాధ్యతలను చక్కగా నిర్వహిస్తోంది. ప్రాక్టీస్ కోసం ఢిల్లీకి వెళ్లడం, ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జముయ్ రావడం.. ప్రస్తుతం ఆమె రైలు ద్వారా అప్ అండ్ డౌన్ చేస్తోంది. ఇక, పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే కృత నిశ్చయంతో ఉంది. ఆమె ఆశయం నెరవేరాలని కోరుకుందాం.

# పారిస్ ఒలింపిక్స్ 2024 వేడుకల్లో చిరు ఫ్యామిలీ



**విశ్వంభర, పారిస్ :** టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. చిరంజీవి, సురేఖ, రామ్ చరణ్, ఉపాసన నిన్న జరిగిన పారిస్ ఒలింపిక్ ఓపెనింగ్ వేడుకల్లో సందడి చేశారు. అంతేకాదు, చిరంజీవి ఒలింపిక్ జ్యోతి (ఒలింపిక్ టార్చ్ రెప్లికా) ప్రతిరూపాన్ని చేతబూనారు. దీనికి సంబంధించిన ఫొటోను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. "పారిస్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు హాజరు కావడం నిజంగా సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సురేఖతో కలిసి ఒలింపిక్ జ్యోతి ప్రతిరూపాన్ని చేతబూనిన క్షణాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. మన భారత జట్టులోని ప్రతి క్రీడాకారుడు అత్యుత్తమంగా రాణించాలని కోరుకుంటున్నాను. భారత్ కు గతంలో ఎన్నడూ రానన్ని పతకాలు గెలవాలని ఆకాంక్షిస్తున్నాను... జై హింద్" అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు.

# రూ.500 నోటుపై కీలక ప్రకటన చేసిన ఆర్‌బీఐ

- సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న వార్తలన్నీ పూర్తి అవాస్తవం
- స్పష్టం చేసిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో

**విశ్వంభర, ముంబయి :** రూ.500 కరెన్సీ నోటుపై కొద్దిరోజులుగా చిత్ర విచిత్రమైన వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇవి అసలా? లేదంటే అబద్దపు వార్తలా? అన్న విషయంలో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. దీంతో భారతీయ రిజర్వు బ్యాంకు వీటిపై స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న వార్తలన్నీ పూర్తి అవాస్తవమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. రూ.500 నోటుపై స్టార్ గుర్తు ఉన్నవన్నీ నకిలీ నోట్లంటూ జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించింది. సీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఈ విషయాన్ని ఎక్స్ లో వెల్లడించింది.

### స్టార్ గుర్తుకు అర్థం చెప్పిన ఆర్‌బీఐ..

స్టార్ గుర్తు ఉన్న నోట్లు 2016 డిసెంబరు నుంచి మార్కెట్ లో చలామణి అవుతున్నాయని తెలిపింది. దేశవ్యాప్తంగా చలామణి చేసేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు వివిధ నోట్లను అందుబాటులోకి తెస్తోంది. వీటిపై సీరియల్ నెంబరు ముద్రిస్తారు. అయితే కొన్ని నోట్లపై స్టార్ గుర్తు ఉండటంతో అలాంటివి చెల్లవంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో వార్తలను ప్రచారంలోకి తెస్తున్నారు. గతంలో కూడా ఈ తరహాలోనే వార్తలు వస్తే రిజర్వు బ్యాంక్ స్పష్టత ఇచ్చింది. అయినప్పటికీ మళ్లీ అదే తరహా వార్తలు చలామణి అవుతుండటంతో కేంద్రం రంగంలోకి దిగింది. స్టార్ గుర్తు ఉన్న నోట్లు ఇతర నోట్లులానే చెల్లుతాయని, సీరియన్ నెంబరుకు, ప్రిఫిక్స్ కు మధ్య ఈ స్టార్ గుర్తు ఉంటుందని చెప్పింది. అసలు స్టార్ గుర్తు అంటే అర్థం ఏమిటో వివరించింది. రీప్లేస్ చేసి తిరిగి ముద్రించిన నోట్లు అని అర్థం వస్తుంది. వీటిని సులువుగా గుర్తించడానికి స్టార్ గుర్తును వాడుతున్నారు.

### నాణ్యత లేని కాగితాన్ని వాడుతున్నారు..

2017లో కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసింది. రూ.వెయ్యి, రూ.500 నోట్లను రద్దు చేసి తర్వాత రూ.2వేల నోటును, రూ.500 నోటును, రూ.200 నోటును తీసుకొచ్చింది. వీటితోపాటు రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. వీటిని చూసిన ప్రజలంతా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. నలుగురి చేతులు మారితే వెంటనే చినిగిపోతున్నాయని, అంతటి నాణ్యతలేని కాగితాన్ని వాడుతున్నారంటూ మండిపడుతున్నారు. నోట్లు ముద్రించడం చాతకాకపోతే మెదలకుండా ఉండటం ఉత్తమమని, అలా కాకుండా నాణ్యత లేని నోట్లు, అందులోను సరిసంఖ్యలో ఎవరైనా రూ.2వేల నోట్లు, రూ.200 నోట్లు తెస్తారా? అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.





## అక్టోబర్‌లో ఆది షణ్ముఖ

**విశ్వంభర, సినిమా:** వైవిధ్యమైన చిత్రాలను, విభిన్నమైన కథలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ చిత్రం షణ్ముఖ. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. ఈ పోస్టర్ అందరిలోనూ ఆసక్తిని రేపుతుంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటిస్తున్న విషయం తెలిసిందే. పోలీస్‌డ్రెస్‌తో ఆది పవర్‌ఫుల్‌గా కనిపిస్తుండగా, ఆయన వెనకాల షణ్ముఖ సుబ్రహ్మణ స్వామి కనిపించడం, పోస్టర్ చూసిన అందరిలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తుంది. ఇక షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ క్రమంలోనే మూవీ నుంచి విడుదలకు సంబంధించిన అనౌన్స్‌మెంట్‌ను ఇచ్చింది. ఈ సినిమాను అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

## హాట్ హాట్‌గా ప్రగ్యా జైస్వాల్



**విశ్వంభర, సినిమా :** 'కంచె' సినిమాతో ప్రగ్యా జైస్వాల్ పేరు మారుమోగింది. అయితే ప్రగ్యా ఎక్కువగా తెలుగు సినిమాలు ఎందుకో వరసగా చెయ్యడం లేదు. కేవలం తనకి నచ్చితేనే చేస్తోంది అని అనుకోవచ్చు. 'కంచె' సినిమా 2015లో విడుదలైంది, వరుణ్ తేజ్ అందులో కథానాయకుడు, క్రిష్ దర్శకుడు. తరువాత 2017లో వరసగా నాలుగు తెలుగు సినిమాల్లో నటించింది ప్రగ్యా. అరంగేట్రం చెయ్యడం హిందీ సినిమా 'టిట్టూ ఎంబిఎ' తో అయినా, ఆ తరువాత ఎందుకో హిందీ సినిమాలు, వేరే ఇతర భాషా సినిమాలు చెయ్యలేదు ప్రగ్యా. దర్శకుడు క్రిష్ హిందీ సినిమా ' గబ్బర్ ఈజ్ బ్యాక్' కి దర్శకత్వం వహించినప్పుడు ప్రగ్యా ఆ హిందీ సినిమా కోసం ఆడిషన్స్ ఇచ్చింది. అప్పుడు ఆ సినిమాకి తీసుకోలేదు కానీ, క్రిష్ తరువాత తాను చేసిన 'కంచె' సినిమాలో ప్రగ్యా జైస్వాల్ ని కథానాయికగా తీసుకున్నాడు. అలా ఆ 'కంచె' సినిమా ప్రగ్యా జైస్వాల్ కి మంచి పేరు తెచ్చి పెట్టింది. 2021 లో బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్ లో వచ్చిన 'అఖండ' సినిమాలో ప్రగ్యా జైస్వాల్, బాలకృష్ణకి జోడీగా నటించింది. ఆ సినిమాలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేశారు, అందులో యువ బాలకృష్ణకి జోడీగా కలెక్టర్ పాత్రలో ప్రగ్యా నటించింది. అంతే ఆ సినిమా తరువాత మళ్ళీ తెలుగు సినిమా ఆమెది విడుదల కాలేదు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా వస్తున్న 'టైసన్ నాయుడు' అనే సినిమాలో ప్రగ్యా జైస్వాల్ విలన్ గా చేస్తోంది అని ఒక వార్త నడుస్తోంది. సాగర్ కె చంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ ఒక పోలీసాఫీసర్ గా నటిస్తుండగా, అతనికి ప్రత్యర్థి పాత్రలో ప్రగ్యా జైస్వాల్ చేస్తోంది అని ఒక టాక్. ఇదే కాకుండా ఇప్పుడు బాలకృష్ణ, కెఎస్ రవీంద్ర (బాబీ) కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో కూడా ప్రగ్యా జైస్వాల్ నటిస్తోంది అని ఇంకొక వార్త నడుస్తోంది. కానీ ఇది అధికారికంగా ఎటువంటి ప్రకటన లేదు.

## సప్త సాగరాలు బ్యూటీతో విజయ్ దేవరకొండ?

**విశ్వంభర, సినిమా:**


టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. లైగర్ వంటి భారీ డిజాస్టార్ తర్వాత ఖుషి, ఫ్యామిలీ స్టార్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాగా ఈ సినిమాలు కూడా బాక్సాఫీస్ ముందు ఫ్లాప్‌గా నిలిచాయి. ఇక ప్రస్తుతం విజయ్ గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ప్రస్తుతం శ్రీలంకలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే మరో ప్రాజెక్ట్‌ను విజయ్ పట్టాలెక్కించబోతున్నాడు. 'రాజా వారు రాణి గారు' ఫేమ్ రవికిరణ్ కోలాతో విజయ్ ఒక సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ రోల్‌కు సంబంధించి ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో కథానాయికగా సప్త సాగరాలు బ్యూటీ రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదట ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయి పల్లవిని అనుకున్నారు మేకర్స్. కానీ అనుకోకుండా ఆ ప్లేస్ లో ఇప్పుడు రుక్మిణి వచ్చింది. అయితే ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.








## వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు సహజ నివారణలు



**విశ్వంభర, ఫీచర్:**

వర్షాకాలం ఒక విధంగా చాలా మంది ఇబ్బంది పడే కాలం.. చిన్నారులు, పెద్దవాళ్లు ఉన్న ఇళ్లు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. అపరిశుభ్ర వాతావరణంలో అంటు వ్యాధులకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతి రోజు ఇంటిని డెటాల్ లేదా లైజాల్ వంటి వాటితో శుభ్రపరుచుకోవాలి. డస్ట్ బిన్ కూడా ఎప్పుడూ కడిగి పెట్టుకోవాలి. ఏ మాత్రం తడి లేకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో ప్రజలు బాధపడే అత్యంత సాధారణ వ్యాధుల జాబితా చూద్దం.

**డెంగ్యూ:** భారతదేశంలో ప్రతి సంవత్సరం డెంగ్యూ కారణంగా గణనీయమైన సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నారు. మరికొందరు తీవ్రమైన అనారోగ్యానికి గురవుతారు. అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. లక్షణాలు వికారం, వాంతులు. దద్దుర్లు. నొప్పులు మరియు నొప్పులు (కంటి, కండరాలు, కీళ్ళు లేదా ఎముకల నొప్పి).

**చికున్‌గున్యా:** చికున్‌గున్యా అనేది టైగర్ దోమ అనే ప్రత్యేక రకం దోమల ద్వారా వ్యాపిస్తుంది, ఇది ఓవర్‌హెడ్ ట్యాంకులు, కూలర్‌లు, మొక్కలు మరియు నీటి పైపుల వంటి మురికి నీరు పేరుకుపోయే పరిస్థితులలో జీవించడానికి అనుకూలంగా ఉంటుంది. లక్షణాలు జ్వరం, కీళ్ల నొప్పి, తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్ల వాపు, లేదా దద్దుర్లు.

**మలేరియా:** మలేరియా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగించే దోమల ద్వారా సంక్రమించే వ్యాధి. అనుకూలమైన సంతానోత్పత్తి పరిస్థితుల కారణంగా అడ్డుపడే నీటిని ఇష్టపడే దోమల ద్వారా ఇది వ్యాపిస్తుంది. లక్షణాలు అధిక జ్వరం, వణుకు, శరీరం చలి, అధిక చెమట మరియు తీవ్రమైన రక్తహీనత.

**టైఫాయిడ్:** టైఫాయిడ్ వర్షాకాలంలో దోమల ద్వారా సంక్రమించే వ్యాధులలో ఒకటిగా పరిగణించబడుతుంది. కలుషిత ఆహారం లేదా నీరు తీసుకోవడం వల్ల ప్రజలు వ్యాధి బారిన పడుతున్నారు. లక్షణాలు దీర్ఘకాలిక జ్వరం, బలహీనత, కడుపు నొప్పి, ఆకలి మందగింపు ఉంటాయి.

**ఇన్ఫ్లుఎంజా:** ఇన్ఫ్లుఎంజా అనేది ఆకస్మిక వాతావరణ మార్పులు లేదా ఉష్ణోగ్రత హెచ్చుతగ్గుల తర్వాత ప్రజలు బాధపడుతున్న అత్యంత సాధారణ వ్యాధి. ఇన్ఫ్లుఎంజా కూడా అంటు వ్యాధి. ఇది ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. లక్షణాలు జ్వరం, కండరాల నొప్పులు, గొంతు నొప్పి, నాసికా రద్దీ మరియు పొడి, నిరంతర దగ్గు ఉంటాయి. వర్షాకాలంలో జ్వరం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి ప్రభావవంతమైన మార్గాలు: రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడం ఉత్తమ మార్గం. టీకాలు వేసుకునేలా మీ కుటుంబ సభ్యులను ప్రోత్సహించండి. గోరువెచ్చని, శుభ్రమైన నీటిని త్రాగండి మరియు హైడ్రేటెడ్ గా ఉండండి. బలమైన రోగనిరోధక శక్తి కోసం మీరు మీ ఆహారంలో విటమిన్లు జోడించవచ్చు. మీ పరిశుభ్రత ప్రమాణాలను పెంచుకోండి మరియు మీ చేతులను తరచుగా కడుక్కోవాలి. దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**చీడలు లేకుండా ఉంచడానికి ఇక్కడ ఐదు సమర్థవంతమైన సహజ నివారణలు**

**నిమ్మ మరియు లవంగం పరిష్కారం**

నిమ్మ తొక్కలు మరియు లవంగాలను నీటిలో ఉడకబెట్టడం ద్వారా శక్తివంతమైన స్ప్రేని సృష్టించండి. ద్రవాన్ని వడకట్టి, దానిని స్ప్రే బాటిల్‌లో పోసి, తలుపులు మరియు కిటికీల వంటి ఎంట్రీ పాయింట్ల చుట్టూ ఉపయోగించండి. సిట్రస్ సువాసన చీమలు, దోమలను సమర్థవంతంగా తిప్పికొడుతుంది.

**వేపనూనె**

వేప నూనె ఒక శక్తివంతమైన సహజ పురుగుమందు మరియు వికర్షకం. స్ప్రే బాటిల్‌లో కొన్ని చుక్కలను నీటితో మరియు తేలికపాటి డిటర్జెంట్‌తో కలపండి. బొద్దింకలు, దోమలు మరియు చీమలు వంటి తెగుళ్లు దాక్కున్న మూలలు, పగుళ్లు మరియు చీకటి ప్రాంతాలను పిచికారీ చేయడానికి వేపనూనెను ఉపయోగించవచ్చు.

**వెనిగర్**

వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల పండ్ల ఈగలు ఎక్కువగా వస్తాయి. ఒక చిన్న గిన్నెలో యాపిల్ సైడర్ వెనిగర్ మరియు కొన్ని చుక్కల డిష్ సోప్ వేసి ప్లాస్టిక్ ర్యాప్‌తో కప్పండి. దానికి చిన్న చిన్న రంధ్రాలు చేయండి. పండ్ల ఈగలు వెనిగర్‌కు ఆకర్షితులై సబ్బు నీటిలో చిక్కుకుంటాయి.

**బిర్యానీ ఆకులు**

బిర్యానీ ఆకులు చీమలు, బొద్దింకలు వంటి వాటిని నివారించడానికి వంటగది క్యాబినెట్లలో బిర్యానీ ఆకులను ఉంచండి. బే ఆకుల యొక్క బలమైన సువాసన సహజ నిరోధకంగా పనిచేస్తుంది. ఇవి మీ ఆహార నిల్వ ప్రాంతాలను తెగులు లేకుండా ఉంచుతుంది.






Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com